నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
సోమవారం | 11 నవంబర్ 2024 | www.navatelangana.com

స్థల పరిశీలన చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణంలో దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న బంజారా భవన్ రోడ్డు సమస్యపై ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్ స్థల పరిశీలన చేశారు. బంజారా భవన్‌కి గుట్ట మీద నుంచి వెళ్ళే దారిలో రోడ్డు క్లియర్ చేయాలని అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు ఇచ్చారు. రోడ్డు వేయడానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం హుస్నాబాద్ ఎల్లమ్మ ఆలయం వద్ద నిర్మిస్తున్న అనిమేని మండపం నిర్మాణాన్ని పరిశీలించారు. నిర్మాణాలకు సంబంధించి ఆలయ ఈవో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆలయం వద్ద రోడ్ల నిర్మాణం, శెట్టర్ల నిర్మాణం తదితర వాటిపై అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, వైస్ చైర్మన్ అయిలేని అనిత, సిద్దిపేట గ్రంథాలయ కమిటీ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం)చేర్యాల పట్టణ కార్యదర్శిగా రాళ్ల బండి నాగరాజు



నవతెలంగాణ-చేర్యాల

సీపీఐ(ఎం) చేర్యాల పట్టణ కార్యదర్శిగా రాళ్ల బండి నాగరాజును శనివారం జరిగిన ఆ పార్టీ పట్టణ 20వ మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ నిరంతరం పట్టణ సమస్యల పట్ల పోరాటం చేస్తున్న సీపీఐ(ఎం)ను ఆదరించాలని పట్టణ ప్రజలను కోరారు. మహాసభల విజయవంతానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాళ్ల బండి నాగరాజు మాట్లాడుతూ పట్టణంలో అనేక సమస్యలు ఉన్నాయని, సమస్యలను పట్టించుకునే నాథుడు లేడని తెలిపారు. మున్సిపల్ ఎన్నికలు జరిగి నాలుగున్నర ఏండ్లు గడిచినా పట్టణం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. సమస్యలపై తమ పార్టీ నూతన కమిటీ పోరాటాల నిర్వహిస్తుందని తెలిపారు. పట్టణ కమిటీ సభ్యులుగా పోలోజు శ్రీహరి, ముస్త్యాల ప్రభాకర్, ఆముదాల నర్సిరెడ్డి, బోయిని మల్లేశం, ఇప్పకాయల శోభ, రాళ్ల బండి భాస్కర్, ఆముదాల రంజిత్ రెడ్డి, ఎర్ర బోసు, అశోక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఇంటింటి సర్వేలో అనుమానాలు వద్దు

ప్రజలందరూ భాగస్వాములు కావాలి
రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఇంటింటికి చేపట్టే కులగణ సర్వేలో అనుమానాలు అవసరం లేదని సమాచారం గోప్యంగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్ పట్టణంలో ఎన్యుమరేటర్‌తో కలిసి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలు సేకరణలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా అన్ని కుల సంఘాల నాయకులను విజ్ఞప్తి చేస్తున్నానని, సమాచార సేకరణకు మీ కుల బలం ఎంతో తెలిస్తే ..మీ కుల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక చేయడానికి ప్రభుత్వానికి అవకాశం ఉంటుందన్నారు. గవర్నర్ కూడా కుటుంబ సర్వేలో వివరాలు నమోదు చేసుకున్నారని తెలిపారు. ప్రజా ప్రతినిధులు ఇంటింటి కుటుంబ సర్వే లో భాగస్వాములు కావాలన్నారు. 150 ఇళ్లకు ఒక ఎన్యుమరేటర్ చొప్పున 85 వేల మంది సిబ్బంది ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తున్నారన్నారు. మనిషికి ఏదైనా ఇబ్బంది వస్తే బాడి ఎక్స్ రే చేసిన మాదిరి కుల గణన సర్వే ఉపయోగపడుతుందన్నారు. ఎవరికి ఏ ఇబ్బందీ రాకుండా చూసుకునే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదన్నారు. తెలంగాణ ప్రజా జీవనంలో మీరంతా బాధ్యులని, ఎలాంటి దురుద్దేశ్యం లేదన్నారు. గతంలో మాదిరి ఒకేరోజు సర్వే చేయడం లేదన్నారు. మీ నియోజకవర్గాల్లో జరిగే కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య అధికారులు పాల్గొన్నారు.

సైక్లింగ్ పోటీలో సంజీవ్‌కు గోల్డ్ మెడల్



నవతెలంగాణ-సిద్దిపేట

9వ ఇంటర్ డిస్టిక్ రోడ్ సైక్లింగ్ ఛాంపియన్షిప్ పోటీలో జనగాంలో జరగగా సిద్దిపేట ఖేలో ఇండియా సెంటర్ కోచ్ సంజీవ్ మాస్టర్స్ 21 కిలోమీటర్ల పోటీలో గోల్డ్ మెడల్ సాధించారు. అదేవిధంగా అక్కడ కోచింగ్ పొందుతున్న క్రీడాకారులు 13 మెడల్స్ సాధించారు. రాష్ట్ర సైక్లింగ్ అధ్యక్షులు మల్లారెడ్డి, కార్యదర్శి విజయ్ కాంతారావు, సిఎఫ్ఐ దత్తాత్రేయ, కోశాధికారి జంగపల్లి వెంకట నరసయ్య, సిద్దిపేట జిల్లా సైకిల్ అధ్యక్షులు బండారుపల్లి శ్రీనివాసులు, డివైఎస్ఓ జయ దేవార్ ఆర్య, అసిస్టెంట్ కోచ్ సంపత్ లు వారికి అభినందనలు తెలిపారు.

అదుపుతప్పి కారు బోల్తా ముగ్గురికి గాయాలు

నవ తెలంగాణ-కొండపాక



కొండపాక మండలం మర్పడగ శివారులో కారు అదుపుతప్పి ముగ్గురికి గాయాలైన సంఘటన ఆదివారం తెల్లవారుజామున జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు యువకులు వారి మిత్రుడైన కొండపాక మండలం సిరసనగండ్ల గ్రామానికి చెందిన సాయి గణేష్ ఇంటికి శనివారం రాత్రికి వచ్చారు. సాయిగణేష్‌తో పాటు వచ్చిన ముగ్గురు తెల్లవారుజామున కారులో సిద్దిపేటకు వెళ్లి తిరిగి సిరిసినగండ్ల గ్రామానికి వస్తున్న క్రమంలో మర్పడగ శివారులో మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి అదుపుతప్పి చెరువు కట్ట కిందికి దూసుకెళ్లింది. దాంతో కారులో ప్రయాణిస్తున్న సాయిగణేష్, రోహన్, రాహుల్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, రమేష్ లు చేరుకొని ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

నారాయణఖేడ్‌లో ది ఆదర్శ్ బ్యాంక్ 25వ శాఖ ప్రారంభం



ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించిన ఎమ్మెల్యే పటోళ్ల సంజీవరెడ్డి
నవతెలంగాణ-కుత్బుల్లాపూర్, నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్‌లో నూతనంగా నెలకొల్పిన ది ఆదర్శ్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 25వ శాఖను ఎమ్మెల్యే పటోళ్ల సంజీవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఆది వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. తమ ప్రాంతంలో ఆదర్శ్ బ్యాంక్ ప్రారంభించడం ఆనందంగా ఉందని.. ఆదర్శ్ బ్యాంక్ ప్రజల అవసరాల రిత్యా అందరికీ బ్యాంకు సేవలను అందించేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం ది ఆదర్శ్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ మదన గోపాల స్వామి మాట్లాడుతూ.. ప్రజల, ప్రజా ప్రతినిధుల, కోరిక మేరకు తమ యొక్క 25వ శాఖను ఈ ప్రాంతంలో నెలకొల్పామన్నారు. చిరు వ్యాపారస్తుల కొరకు ఏటువంటి పూచీకత్తులు లేకుండా వేయి నుంచి పదివేల వరకు తాకట్టు లేకుండా గ్యారం టీలతో అప్పు ఇస్తామన్నారు. అలాగే సెక్యూరిటి ఉన్న ఎడల వారి వ్యాపార అభివృద్ధి అవసరాల కనుగుణంగా అప్పు ఇస్తామన్నారు. తమ బ్రాంచ్‌లో లాకర్ల సౌకర్యం కూడా ఉందని, వారంలో ఏడు రోజులు ప్రజల అవసరాలరీత్యా తెరిచే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ తాహిర్, వార్డు కౌన్సిలర్ సద్దాం, ముజీబ్ ఖాన్, సీఈ వో ఎంవి.రమణ, ఏజిఎంలు అయ్యప్ప నాయుడు, కామినేని శ్రీనివాస రావ్, నూతన బ్రాంచ్ మేనేజర్ దాసరి నవీన్, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగు కాల్వ అక్రమణ



- సాగు కాల్వ మట్టి తొలగించి..చదునుచేసి..
- అక్రమణలో డీ7 సాగు కాల్వ స్థలం
- అధికారుల నిర్లక్ష్యమేనని రైతుల ఆరోపణలు

నవతెలంగాణ-బెజ్జంకి

అన్నపూర్ణ జలాశయం వద్ద నుంచి డీ7 సాగు కాల్వ బెజ్జంకి మండలంలో గుండా రం, బెజ్జంకి గ్రామ శివారు మీదుగా సుమారు 43 కీ.మీ కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం చీమలకుం టపల్లి గ్రామ శివారు వద్ద ముగిస్తుం ది. కాలువ నిర్మాణంతో పాటు తవ్విన మట్టి నిల్వకు అనుగుణంగా భూసేక రణ చేశారు. కాలువ నిర్మించడంతో పాటు ఇరువైపులా కాల్వ కోతకు గురవ్వ కుండా పటిష్ఠత కోసం మట్టిని పోశారు. ప్రధాన కాలువ మధ్యలో నుంచి ఇరువైపులా 13-33 మీటర్ల చొప్పున భూసేకరణ చేశారు. సరైన పర్యవేక్షణ, హద్దురాళ్ల లేకపోవడంతో సాగు కాల్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయన్న ఆరోపణలురైతుల్లో వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా కాల్వ స్థలం మట్టి చదును చేసి నిర్మాణాలు చేపట్టడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. మట్టి తొలగించ డంతో పలు చోట్ల సాగు కాల్వ కట్ట బలహీనపడి కోతకు గురయ్యే ప్రమాద ముంది.

> ఇరిగేషన్ శాఖకు చెందిన విలువైన స్థలాలు అన్యాక్రాంత మవుతున్నాయి. సాగు కాల్వ అవసరాల కోసం సేకరించిన మిగులు భూములు ఆక్రమ ణకు గురవుతున్నాయి. సంబంధిత అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే యథేచ్ఛగా సాగు కాల్వ స్థలం ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. ఓ ఫంక్షన్ హాల్ నిర్మాణదారుడు సాగు కాల్వ మట్టిని చదును చేసి స్థలాన్ని వినియోగించుకునేల సిద్ధమవుతున్న సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తూ ఏమీ చేయలేక పోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సాగు కాల్వ స్థలాలను ఆక్రమించడం మండలంలో పరిపాటైంది. ఇప్పటికైనా సాగు కాల్వ స్థలంలో మట్టిని చదును చేసిన వ్యవహారంపై అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని పరిసర ప్రాంతాల్లోని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

-మట్టిని తొలగించడంతో అక్రమణ

సాగు కాల్వ పటిష్ఠత కోసం పోసిన మట్టిని కొందరు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కాలువ మట్టిని అక్రమార్కులు తరలించడంతో ఖాళీ స్థలాలు ఏర్పడుతున్నాయి. దీంతో సమీపంలోని పట్టాదారులు చదును చేసిన స్థలాన్ని అక్రమించుకుని తమ భూమిలో కలిపేసుకొని ఫంక్షన్ హాల్ అవసరాలకు వినియోగించుకునేల యథేచ్ఛగా సంసిద్ధమవ్వడం విశేషం. ఇరిగేషన్ శాఖ అధికారులు రాజకీయ ఒత్తిళ్లతో అచేతన స్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది.

అధికారులు పట్టించుకోవడం లేదు



సాగు కాల్వ నిర్మాణానికి బెజ్జంకి శివారులోని సర్వే నంబర్ యందు 993 యందు స్వంత పట్టా భూమిలో 1.20 ఎకరాలు అధికారులు సేకరించి సుమారు.14 లక్షలు పరిహారమంద జేశారు. భూ సేకరణలో అధికారులు నా స్వంత పట్టా భూమిలో సుమారు 0.14 ఎకరాల భూమిని అధికంగా పట్టా నుంచి తొలగించి పట్టాలేని మరొకరికి పరిహారమందిం చారు. పరిహారంకంటే అధికంగా పట్టా భూమిని తొలగించి ఇతరులకు కేటాయించడంపై న్యాయం చేయాలనిపలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పట్టించుకోవడం లేదు. సాగు కాల్వ స్థలాన్ని అక్రమించుకున్నవారికి మామూళ్లతో అధికారులు వత్తాసు పలుకుతున్నారు. సేకరణ కంటే ఎక్కువ భూమి లాక్కుని అన్యాయం చేసిన అధికారులపై విచారణ చేపట్టి న్యాయం చేయాలి.

-దోనే శ్యామ్

క్రీడలకు హుస్నాబాద్ వేదిక కావాలి

- క్రీడలను ప్రోత్సహించడంలో ముందుంటాం
- రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



హుస్నాబాద్ స్టేడియం రాబోయే కాలంలో క్రీడలకు వేదిక కావాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్ ఇండోర్ స్టేడియంలో 68వ అండర్-14 బాయ్స్ అండ్ గర్ల్స్ ఎస్‌జిఎఫ్ స్టేట్ లెవెల్ హ్యాండ్ బాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. హుస్నాబాద్‌లో క్రీడలకు మరింత ప్రోత్సాహం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అన్ని రకాల కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో క్రీడలకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సియోల్‌లో స్పోర్ట్స్ యూనివర్శిటీ చూసిన తరువాత స్ఫూర్తి పొంది ముఖ్యమంత్రి యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. అందులో అడ్మిషన్ తీసుకునే ప్రక్రియలో స్పోర్ట్స్‌లో ప్రావీణ్యత ఉన్న వారికే స్పోర్ట్స్ యూనివర్శిటీలో అడ్మిషన్ ఉంటుందన్నారు. రాబోయే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో హుస్నాబాద్ నుంచి అధిక సంఖ్యలో అడ్మిషన్లు పొందాలన్నా రు. పోతారంలో కబడ్డీ పోటీల్లో పాల్గొని వ్యాయామ ఉపాధ్యాయుడు కృష్ణ పెట్టుకొని క్రీడలో శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. వ్యాయా మం, జిమ్, అథ్లెటిక్స్‌తో మరింత ముందుకు పోతున్నామన్నారు. క్రీడలను ప్రోత్సహించడంలో ముందుంటామని, రేపు మీ గ్రామానికి రాష్ట్రానికి దేశానికి మంచి పేరు తేవాలని మీ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడిన వారికి ప్రోత్సహిస్తామని, మీరు ఆటల్లో రాణించాలన్నారు. అండర్-14 బాయ్స్ అండ్ గర్ల్స్ హ్యాండ్ పోటీలో ఫైనల్లో ఆదిలాబాద్, వరంగల్ బాలికలు, కరీంనగర్, వరంగల్ బాయ్స్‌కి బహుమతుల ప్రధానం చేశారు. హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వాహకులకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, వైస్ చైర్మన్ ఐలేని అనిత, సిద్దిపేట గ్రంథాలయ కమిటీ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై
సీఐటీయూ నిరంతర పోరాటాలు



నవతెలంగాణ-పటాన్‌చెరు

కార్మిక సమస్యలపై సీఐటీయూ నిరంతర పోరాటాలు చేస్తున్నదని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని ఐలా భవన్‌లో ఆదివారం జరిగిన కిర్బి కార్మికుల జనరల్ బాడీ సమా వేశానికి ముఖ్యఅతిథిగా యూనియన్ అధ్యక్షులు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు హాజరై మాట్లాడుతూ.. కార్మికులకు అండగా ఉండే కార్మిక సంఘం సీఐటీయూ మాత్రమే అన్నారు. కార్మికుల సమస్యల పైన నిరంతరం పోరాడుతున్న సంఘం సీఐటీయూ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. చట్టపరమైన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్మికులంతా ఐక్యం గా ఉద్యమించి తమ సమస్యలు పరిష్కారమవు తాయ న్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్య లు కే.రాజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు పాండురంగారెడ్డి, యూ నియన్ నాయకులు విఎస్ రాజు, నాగ ప్రసాద్, ఏడుకొండలు, లఖాన్, లక్ష్మణ్, వెంకట్, జైపాల్ ,మహేశ్వర్ రెడ్డి, మల్లేశం, తలారి శ్రీనివాస్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ..
పోరాటాలే ఏకైక మార్గం



- ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

సీపీఐఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి.



నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్:

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. ఆదివారం సిపిఎం సిద్దిపేట అర్బన్ మండల 3వ మహాసభ యాదగిరి, తౌటి వెంకటేష్, చెప్యాలా బాలమనీ అధ్యక్షతన నిర్వహించగా, మహాసభ ప్రారంభ సూచికగా పార్టీ జెండాను ఆవిష్కరించిన మల్లారెడ్డి మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ నరేంద్ర మోడీ ప్రభుత్వం సంవత్సరానికి కోటి ఉద్యోగాలు ఇస్తానని చెప్పి నల్లధనాన్ని వెలికి తీసి ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు అకౌంట్లో వేస్తానని చెప్పి స్వామినాథం కమిషన్ సిఫార్సులు చేస్తానని వాగ్దానం చేసి ఎన్నికల తర్వాత వాటి ఊసేత్తకుండా కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ మత విద్వేషాలు రెచ్చగొడుతూ కాలం గడుపుతున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో ఎన్నికలకు ముందు అనేక వాగ్దానాలు చేసి ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు రెండు లక్షల వరకు రుణాలు మాఫీ చేయలేదన్నారు. రైతుబంధు ఇప్పటివరకు వారి ఖాతాలో వేయలేదని మహిళలకు ఆర్భాటంగా ప్రకటించిన మహాలక్ష్మి పథకం కింద రూ.2500 అమలు కాలేదన్నారు. 500 గ్యాస్ పథకం కూడా ఏ ఒక్క కుటుంబానికి రావడం లేదన్నారు. వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని లేనిచో రైతులను ఏకం చేసి సీపీఐఎం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

మహాసభలో పలు తీర్మానాలు

సిద్దిపేట అర్బన్ మండల మహాసభలో అర్బన్‌లో నెలకొన్న అనేక సమస్యలపై తీర్మానాలు చేయడం జరిగింది. వివిధ వార్డులలో ఇప్పటివరకు సిసి రోడ్లు లేనటువంటి వాటిలో వెంటనే సిసి రోడ్లు వేయాలని, క్రోనో కార్పస్ చెట్లను తొలగించాలని, ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్ల నిర్మాణానికి కేంద్ర రాష్ట్ర కలిపి రూ. 10 లక్షలతో ఇంటి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. అర్బన్‌లో వీధి కుక్కల, కోతుల, దోమల బెడద నుండి ప్రజలను కాపాడాలని, అసంఘటిత రంగ కార్మికులకు వారి సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు ఈపీఎఫ్ ఆఫీసును సిద్దిపేటలో నే కొనసాగించాలనే తదితర అంశాలపై ఈ మహాసభలో తీర్మానాలు చేయడం జరిగింది. రాబోయే మూడు సంవత్సరాల కాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాటాలు చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ మహాసభలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, రాళ్ల బండి శశిధర్‌లు పాల్గొని ప్రసంగించారు. ఈ మహాసభలో సీపీఐఎం జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల నర్సయ్య, దాసరి ప్రశాంత్, జాలిగపు శిరీష, పార్టీ అర్బన్ మండల కార్యదర్శి చొప్పరి రవికుమార్, శాఖా కార్యదర్శులు నరసింహులు, మధు, కృష్ణ, నగేష్, సంజు కుమార్, బెల్లి రాజమణి, దండు లక్ష్మి వీరితోపాటు పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రియాంక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- నిందితున్ని కఠినంగా శిక్షించాలి
- ప్రియాంక కుటుంబాన్ని పరామర్శించిన సీఐటీయూ, కేవీపీఎస్ బృందం

నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో కుంట భాస్కర్ వేధింపులకు భరించలేక ఆత్మహత్య చేసుకున్న వివాహిత ప్రియాంక కుటుంబాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మరాటి కృష్ణమూర్తి, సీఐటీయూ, కేవీపీఎస్ బృందం నాయకులు రంగారెడ్డి, బాల్ లక్ష్మి, ఆవుల కాడి పరశురాములు, గీసు మల్లేశంలు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేధింపుల వలన చనిపోయిన దళిత మహిళ కుటుంబం రోడ్డున పడ్డారు అని విచారం వ్యక్తం చేశారు. మృతురాలి భర్తతో పాటు ఇద్దరు కూతుర్లు భవ్యశ్రీ (2) శరణ్య (5 నెలలు) ఉన్నారు. తల్లి మృతిచెందడంతో పిల్లల అనాదాలుగా మారి భవిష్యత్ ఆగమ్య గోచరంగా మారిందని పిల్లల పెంపకం చదువులకు ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితుడు కుంట భాస్కర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రోజూ రోజుకు మహిళలపై దాడులు వేధింపులు పెరుగుతున్నాయని, మద్యం బెల్టు షాపులు నియంత్రించాలని, దాడులు చేసిన వారిని ఫాస్ట్రాక్ కోర్టులు ద్వారా విచారణ జరిపించి త్వరగా శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సంగారెడ్డి
2
సోమవారం | 11 నవంబర్ 2024 | www.navatelangana.com

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-రాయికోడ్



మండలంలోని పిపడ్‌పల్లి గ్రామానికి చెందిన లాలూబి రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందింది. ఈ విషయం తెలిసి..రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలతో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ గొల్ల అంజయ్య మృతురాలి కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. ఆమె కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటామన్నారు. అనంతరం అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సంజీవులు అనారోగ్యానికి గురవడంతో పరామర్శించారు. తదనంతరం అల్లాపూర్ గ్రామ శివారులో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కొనసాగుతున్న గ్రౌండ్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబు, బక్కన, వెంకన్న, విట్టర్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

నవతెలంగాణ-సదాశివపేట



ప్రభుత్వం చేపట్టిన సామాజిక ఆర్థిక, ఉపాధి, విద్య, రాజకీయ కుల సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్డీవో రవీందర్ రెడ్డి అన్నారు. సదాశివపేట పట్టణంలోని రెండో వార్డులో గల శివపురి కాలనీలో ఆదివారం చేపట్టిన సర్వేను తహసీల్దార్ సరస్వతి, ఆర్ఐ అనంతయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. కుల గణన ప్రక్రియను పకడ్బందీతో నిర్వహించాలన్నారు. ఈ సర్వేకు ప్రజలకు కూడా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-రాయికోడ్

మండల పరిధిలోని ఔరంగనగర్ గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ దండు నాగార్జున, మానస వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ పాల్గొన్నారు. అనంతరం వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చేవెళ్ల విట్టల్, ఉపాధ్యక్షులు మల్లేష్ కురుమ, ప్రధాన కార్యదర్శి శంకర్, మండల పార్టీ యూత్‌అధ్యక్షుడు అంజి ముదిరాజ్.వరం మాజీ వైస్ చైర్మన్ తుకారాం, తాజా మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాంత్‌రెడ్డిని పరామర్శించిన నీలం మధు

నవతెలంగాణ-జిన్నారం

అనారోగ్యంతో భుజానికి శస్త్ర చికిత్స చేసుకున్న కాంగ్రెస్ నేత శ్రీకాంత్ రెడ్డిని ఆదివారం జిన్నారం మండల పరిధిలోని సోలక్పల్లిలో గల ఆయన స్వగృహంలో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన యోగక్షేమలపై వాకబు చేశారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామని.. కాంగ్రెస్ యువనేత శ్రీకాంత్‌రెడ్డి తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డే కృష్ణ, జిన్నారం మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు ఎంపీపీ గంగు రమేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మాదారం కలవాలి రాజు గౌడ్, నాయకులు అండూ ర్ పంతులు సత్యనారాయణ, శ్రీరామ్, శివరాజ్, మల్లేష్, శ్రీను, శ్రీనివాస్, మహేష్, సత్యనారాయణ, వెంకటేష్, మల్లేష్, రఘు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



నూతన వస్త్రధారణ వేడుకల్లో నాయకులు

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని ఖలీల్‌పూర్ గ్రామంలో జరిగిన మాజీ సర్పంచ్ పి.గోపాల్ కుమారుడు, కుమార్తెల నూతన వస్త్రాధారణ వేడుకల్లో పలువురు నాయకులు నరోత్తం, శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, జైపాల్, బాల్ రాజ్,విఠల్ రెడ్డి,తుకారాం,పెంటన్న, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



కులగణన సర్వే పక్కాగా చేయాలి

నవతెలంగాణ-న్యాల్‌కల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టిన కుల గణన ఇంటింటి సమగ్ర సర్వేను పక్కాగా చేయాలని ఎన్యూమరేటర్లకు, సూపర్వైజర్లకు తహసీల్దార్ భూపాల్ సూచించారు. కల్‌బేమల్, మామిడిగి, న్యామత బాద్, రాజోల,పలు గ్రామాల్లో ఇంటింటి సర్వే పోలింగ్ బూత్‌లను ఆర్ఐ శ్యామ్ రావుతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఓటర్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ప్రతీ పోలింగ్ బూత్‌లో 18 ఏండ్లు నిండిన యువతీ యువకులు ఆన్లైన్‌లో గానీ పోలింగ్ బూత్‌లో బీఎల్‌ఓ దగ్గర నమోదు చేసుకోవాలన్నారు. ఇంటింటి సర్వే కుటుంబాల దగ్గర పూర్తి సమాచారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ తిరుపతి, బీఎల్వోలు గ్రామస్తులు ఉన్నారు.



ముగిసిన విగ్రహ ప్రతిష్టాపన పూజలు

నవతెలంగాణ-న్యాల్‌కల్

రేజింతల్ గ్రామంలో గ్రామదేవతల పున:ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. బర్దిపూర్ అవధూత గిరి మహారాజ్, గ్రామస్తుల ఆధ్వర్యంలో మూడ్రోజుల పాటు యజ్ఞహోమాలు వైభవంగా నిర్వహించారు. చివరి రోజైన ఆదివారం పురాతన గ్రామదేవతల విగ్రహా ప్రతిష్టాపన ముగిసింది. సమీప గ్రామాల పాటు గ్రామస్తులు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గ్రామ దేవతలకు పూజలు చేసి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో బర్దిపూర్ సిద్దేశ్వర, విశ్వనందగిరి, శబరిమాత, తదితర ముఖ్య మహరాజ్ లు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు..

డాక్టర్ దంపతుల కృషి అమోఘం





- జహీరాబాద్ శ్రామిక్ విజ్ఞాన కేంద్రాన్ని ఆదరించండి
- పిల్లల పండగలో పాల్గొనడం ఆనందంగా ఉంది
- హైదరాబాద్ రేంజ్ ఇంటిలిజెన్సీ ఐజి సుమతి
- ఘనంగా ప్రారంభమైన 'పిల్లల పండుగ'

నవతెలంగాణ-జహీరాబాద్

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు డాక్టర్ శివబాబు, విజయలక్ష్మి దంపతులు వారి బృందం, శ్రామిక్ విజ్ఞాన కేంద్రం నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఎంతో ఆనందాన్నిచ్చాయని హైదరాబాద్ రేంజ్ ఇంటెలిజెన్సీ ఐజి సుమతి అన్నారు. జహీరాబాద్ పట్టణంలోని ఆర్ఎల్ఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారంఏర్పాటు చేసిన 'మూడో పిల్లల పండగ' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డాక్టర్ విజయలక్ష్మి తన కాలేజ్ మిత్రురాలు అని గుర్తు చేశారు. తాను 8 ఏండ్లక్రితం సంగారెడ్డి జిల్లా ఎస్పీగా బదిలీపై వచ్చినప్పుడు విజయలక్ష్మి డాక్టర్ గా జహీరాబాద్‌లో స్థిరపడ్డారని



తెలియగానే ఆనందించా నన్నారు. తాను ఎస్పీగా జిల్లాలో ఉన్నప్పుడు ప్రతీయేడు ఎన్నో రకాల కార్యక్రమాలను కలిసి నిర్వహించారన్నారు. జన విజ్ఞాన వేదికతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేసిన కార్యక్ర మాలు ప్రజల్లో ఎంతో ఆదరణను కలిగించాయన్నారు. మొదటి సంవత్సరం 16 పాఠశాలలతో ప్రారంభమైన ఈ జహీరాబాద్ పిల్లల పండగ కార్యక్రమం.. నేడు హైద రాబాద్, సంగారెడ్డి మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలకు విస్తరించడం గొప్ప విషయమన్నారు. ఆయా జిల్లాల నుంచి కూడా విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు రావడం ఎంతో హర్షణీయమన్నారు. మూడో సంవత్సరం 80 పాఠశాలల నుంచి 2500 మంది విద్యార్థులు ఎన్నో రకాల ప్రతిభా పాట వాలను కనబరిచేందుకు పోటీ పడుతున్నారన్నారు. గత మూడేండ్లుగా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని భావించినప్పటికీ సమయం లభించక పోవడంతో రాలేకపోయానన్నారు. కానీ మూడో సంవత్సరం హాజరై ఇక్కడ విద్యార్థులు నిర్వహిస్తున్న వివిధ పోటీ ప్రదర్శనలు చూడడం ఆనందంగా ఉందన్నారు. ఈ విధమైన కార్యక్రమాలకు ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. సభా అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. ఎంతో మంది ఆడపిల్లలకు రోల్ మోడల్‌గా నిలిచిన ఐజీ సుమతి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఐజి సుమతి కళాశాల సమ యం నుంచే ధైర్యంగా ఉండి.. తనకు ఏ శాఖలో ఏ కార్యక్ర మాన్ని అప్పగించినా తనదైన ముద్ర వేసుకున్నది. విద్యా ర్థుల్లో పోటీ తత్వాన్ని పెంచడం వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడమే తమ లక్ష్యమన్నారు. పండగ మేనేజింగ్ డైరెక్టర్ బిరామచందర్, డాక్టర్ శివ బాబులు మాట్లాడుతూ.. గత మూడేండ్లుగా తాము నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను కనబర్చడం సంతోషంగా ఉందన్నారు. స్వాతంత్రం వచ్చి 75 ఏండ్లు పూర్తయినప్పటికీ నేటికీ ఎక్కడో ఒకచోట మూఢనమ్మకాలతో దాడులు జరగడం బాధాకరమ న్నారు. వివిధ వర్గాలు, కులాల మధ్య వివిధ రూపాల్లో నేటికీ వివక్షత కొనసాగడం శోచనీ యమన్నారు. అందువల్లే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చాలని తాము ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామ న్నారు. కాగా ఈ కార్యక్రమంలో ఏ విధమైన సంఘటనలు చోటు చేసుకోకుండా జహీరాబాద్ ఎస్ఐ కాశీనాథ్ సమ క్షంలో ట్రాఫిక్ ఆంక్షలు రాకుండా గట్టి బందోబస్తును ఏర్పా టు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రామిక విజ్ఞాన కేంద్రం సభ్యులు మహిపాల్ అశోక్, సిస వివిధ పాఠశాలల ప్రధా నోపాధ్యాయులు కవితా రెడ్డి, రమేష్ బాబు, మాధవి, శ్రీశైల ం, చంద్రశేఖర్, సరోజ, వెంకటయ్య, విశాల్ శేఖర్ రెడ్డి, సంతోష్ కుమార్, సువర్ణ లక్ష్మి, గౌతమ్, కవిత రెడ్డి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికి భోజనాలు అందించడం ఆనందంగా ఉంది



ఈ యేడు 6000 మంది కోసం భోజనాలను ఏర్పాటు చేశాం. పిల్లల పండుగలో పాల్గొన్న రిజిస్టర్ చేసుకున్న 2500 మంది విద్యార్థులకు మొదటి ప్రాధాన్యతగా భోజనాన్ని వడ్డించి తదుపరి ఉపాధ్యాయులు అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులకు సహాయకులకు కూడా సుమారు 5000 మందికి పైగా భోజనాన్ని అందించడం ఎంతో ఆనందంగా ఉంది.

– రామచందర్, మేనేజింగ్ కమిటీ అధ్యక్షులు

చైర్మెన్ కృషితోనే కళాశాల కేటాయింపు



గత రెండు పర్యాయాలుగా పిల్లల పండుగ కార్యక్రమంలో మా పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని ఎన్నో బహుమతులను సాధించారు. ఇది విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. ఈ అంశాన్ని మా కళాశాల చైర్మెన్ డాక్టర్ లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకు వెళ్లడంతో పిల్లల పండుగను తమ కళాశాలలోనే నిర్వహించాలని నిర్వాహకులకు తెలిపారు.

– కవితారెడ్డి, ఆర్ఎల్ఆర్ ప్రిన్సిపల్

విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచుతాయి



పిల్లల పండగ లాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నూతన ఉత్సాహంతో పాటు పోటీతత్వాన్ని పెంచుతాయి. ఈ విధమైన కార్యక్రమాలతో విద్యారుల్లో దాగి ఉన్న ప్రతిభ బయటికి వస్తుంది. ఉపాధ్యాయులు, అధ్యాపకులు వారి ప్రతిభను గ్రహించి ప్రోత్సహిస్తే రానున్న రోజుల్లో వారు ఆయా రంగాలకు అధిపతులుగా మారే ఆస్కారం ఉంటుంది.

– తనూజ, పల్లవి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్

విద్యార్థుల్లో నైపుణ్యత పెరుగుతుంది



జిల్లాల మధ్య పోటీతో విద్యార్థుల్లో నూతన ఉత్సాహం ఏర్పడి పరిజ్ఞానం అభివృద్ధికి ఈ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయి. మా పాఠశాలనుంచి గత మూడు పర్యాయాలుగా పాల్గొంటున్నాం. ఎన్నో కొత్త విషయాలు తెల్సుకుంటున్నాం.

– ఆలియా, విద్యార్థిని

విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు



మా పాఠశాల నుంచి మూడేండ్లుగా ఎంతోమంది విద్యార్థులు పిల్లల పండగలో ఉత్సాహంగా పాల్గొం టున్నారు. వివిధ పోటీల్లో రాణించి బహుమతులను పొందుతున్నారు. హైదరాబాద్ నుంచి సైతం బస్సుల్లో విద్యార్థులను ఇక్కడికి తీసుకువస్తున్నామని.. విద్యార్థులు కూడా ప్రతిభ చూపిస్తున్నారు.

– మాధవి, ప్రగతి స్కూల్ ప్రిన్సిపల్

కేతకిని సందర్శించిన రాష్ట్ర మహిళా సంరక్షణ డిఐజి

నవతెలంగాణ-ఝరాసంగం

దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయాన్ని ఆదివారం తెలంగాణ రాష్ట్ర మహిళా సంరక్షణ డిఐజి అధికారి సుమతి సందర్శించారు. ముందుగా ఆలయ అధికారులు, అర్చకులు మంగళ వాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలోని శ్రీ పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి వారికి మహా రుద్రాభిషేకం, మహా మంగళహారతి, కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు శాలువా పూల మాలతో ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలతో పాటు స్వామివారి మొమెంటు ను అందించారు.



చారిత్రాత్మకమైన వేతన ఒప్పందాలు సీఐటీయూకే సాధ్యం



నవతెలంగాణ-పటాన్‌చెరు

చారిత్రాత్మకమైన వేతన ఒప్పందాలు సీఐటీయూకే ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్ అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని శ్రామిక్ భవన్ లో ఆదివారం జరిగిన సెనర్జీ కార్మికుల జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథిగా యూనియన్ అధ్యక్షులు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే మల్లికార్జున్ హాజరై మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో సీఐటీయూ ముందుంటుంద న్నారు. సెనర్జీ పరిశ్రమలో చారిత్రకమైన వేతన ఒప్పందం జరిగిందన్నారు. కార్మికుల ఐక్య పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. మంచి ప్యాకేజీ, అలవెన్స్, పీడిఎ, బీమా తదితర అనేక సౌకర్యాలు సాధించడం జరిగిందన్నారు. చారిత్రాత్మక వేతన ఒప్పందాలు కేవలం సీఐటీయూకే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య, యూనియన్ నాయకులు శాంతకుమార్, హరినాథ్, కృష్ణారెడ్డి, ప్రసాద్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎన్యుమరేటర్లకు పని భారం తగ్గించాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

కులగణన ఎన్యుమరేటర్లకు పనిభారం తగ్గించాలని.. సర్వే చేసిన కుటుంబాల ఆధారంగా రెమ్యూనరేషన్ ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కే.అశోక్, ప్రధాన కార్యదర్శి బి. సాయిలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని అమలు చేస్తున్న కుల గణన సందర్భంగా ఎన్యుమరేటర్లుగా నియమించబడ్డ ఉద్యోగ, ఉపాధ్యాయ మిత్రులకు పని భారం తగ్గించాలని, ఇంకా కొంత ఎక్కువ మందిని ఎన్యుమరేటర్‌లుగా తీసుకొని ప్రతి అన్యుమరేటర్ కి 100 లోపు కుటుంబాలు వచ్చేటట్టుగా చర్య తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఒక ఎనిమిరేటర్‌కు 150, 175, 180,200 కుటుంబాలు కేటాయించడం తలకు మించిన భారంగా మారుతున్నదన్నారు. కాబట్టి ఈ విషయమై జిల్లా కలెక్టర్ పునర్ ఆలోచన చేసి ఎన్యుమరేటర్ల సంఖ్యను పెంచాలని కోరారు. ఎనిమరేటర్లకి ఇచ్చే రెమ్యూనరేషన్ సర్వే చేసిన కుటుంబాల ఆధారంగా ప్రకటించి సర్వే పూర్తయిన వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పేదింటి పెండ్లికి పుస్తెమెట్టలు అందజేత

నవతెలంగాణ-జోగిపేట

అందోల్-జోగిపేట్ మున్సిపల్‌లోని 20 వార్డులో గల బుడగజంగాల కులానికి చెందిన సంకు రాములు మనమరాలు యాదమ్మ వివాహానికి ఆ వార్డ్ కౌన్సిలర్ చందర్‌నాయక్ ఆదివారం రోజున పుస్తె మెట్టలను బహుకరించారు. పేదింటి కుటుంబానికి తనవంతుగా సాయం చేసినట్టు కౌన్సిలర్ చెప్పారు.



పత్తి తీయడానికి కూలీల కొరత

నవతెలంగాణ-న్యాల్‌కల్



కష్టపడి పండించిన పత్తి పంట చేతికొచ్చిన సమయానికి కూలీలు దొరకపోవడంతో చేనుపైనే నల్లబడుతన్నది. అలాగే అకస్మాత్తుగా పడుతున్న భారీ వర్షాలకు పంట కూడా తడిసిపోతున్నది. మండలంలోని చాల్కి, మ్యరుజాపూర్, అత్నూర్, టేకూర్ లాంటి పలు గ్రామాల్లో కూలీలు దొరక్క రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస కూలీలు పత్తి తీసేందుకు వచ్చి నప్పటికీ.. తెంపడానికి కిలో పత్తికి రూ.12 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మరోపక్క ఈసారి దిగుబడి తగ్గిందని రైతన్నలు చర్చించుకుంటున్నారు.

దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్న నీలం మధు

నవతెలంగాణ-హత్నూర



మండల పరిధిలోని మధుర గ్రామ శివారులోగల పుణ్యక్షేత్రమైన శ్రీ దత్తాచల క్షేత్రం (దత్తాలయ్య గుట్ట) దత్తాత్రేయ స్వామి ఆలయంలో మెదక్ నియోజవర్గ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ ప్రత్యేక ఆదివారం పూజలు చేశారు. ముందుగా ఆలయానికి వచ్చిన ఆయనకు పార్టీ నాయకులు, ఆలయ అర్చకులు, ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని దత్తాత్రేయ స్వామికి పూజలు నిర్వహించి దైవదర్శనం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పుణ్యక్షేత్రమైన దత్తాత్రే య స్వామి వారి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో జరిగే కులగణన సర్వేను ప్రజలు వారి ఆర్థిక స్థితిగతుల, సామాజిక స్థితిగతులపై, విద్య, స్థితిగతులపై అధికారులకు సహకరించి రాయించుకోవాల న్నారు. దేశవ్యాప్తంగా కుల గణన సర్వే జరిపించాలని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఆలోచన చేస్తున్నా రన్నారు. కుల గణన ద్వారా స్థానిక సంస్థల్లో కూడా బీసీలకు ఎస్సీలకు సంపర్ణ వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హత్నూర మాజీ సర్పంచ్ వీర స్వామి గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కర్రే కృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, సత్యం, మణిదీప్, నరేందర్, ఎన్.ఎం.ఆర్ యువసేన అధ్యక్షులు మన్నె వెంక టేశం, మధుర గ్రామానికి చెందిన నాయకులు రవి ముదిరాజ్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని అడ్డుపెట్టుకుని బీజేపీ రాజకీయం

నవతెలంగాణ-సంగారెడ్డి



హిందూ మతోన్మాదాన్ని అడ్డుపెట్టుకొని బీజేపీ రాజకీయాలు చేస్తోందని సీపీఐ(ఎం) ఏరియా కార్యదర్శి ఎం.యాదగిరి విమర్శించారు. అయోధ్యలో జరిగిన ఎన్నికల్లో లబ్ది పొందాలని చూసినప్పటికీ బీజేపీ అభ్యర్థిని ప్రజలు తిరస్కరించారన్నారు. సీపీఐ(ఎం) సంగారెడ్డి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. దేశంలో మోడీ అధికారంలోకి వచ్చాక నల్లధనం మొత్తం బయటికి తీస్తానని, ప్రతి కుటుంబానికి రూ. 15 లక్షలు జన్‌ధన్ ఖాతా ద్వారా ఎకౌంట్లో వేస్తానని హామీ ఇచ్చారన్నారు. కానీ మూడోసారి అధికారంలోకి వచ్చాక నల్లధనం వెలికితీయ పోక దేశ సంపదను దోచుకుని.. బడా పెట్టుబడిదారులను కాపాడే ప్రయత్నం చేశాడని ఆరోపించారు. మతం పేరుతో కల్లోలాలు సృష్టించి దేశంలో హిందూ మతోన్మాదాన్ని అడ్డం పెట్టుకొని బీజేపీ రాజకీయం చేస్తుందన్నారు. మూడోసారి జరిగిన ఎన్నికల్లో అయోధ్యలో రామ్ మందిరం అడ్డం పెట్టుకొని ఎన్నికల్లో లబ్ది పొందాలని చూస్తే ప్రజలు తిరస్కరించి అక్కడ బీజేపీ అభ్యర్థిని ఓడించారన్నారు. అలాగే రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే ముందు ఆరు గ్యారెంటీలు అమలు చేస్తానని వాగ్దానం చేసినా.. ఏ ఒక్క వాగ్దానం పూర్తిగా అమలు చేయలేదన్నారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయడం లేదన్నారు. కులగణన పేరుతో ప్రజల సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకురాలు మనీ, రజిత, మల్లమ్మ, శోభ, యశోద, రాణి, రమ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వాలి



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

వడ్లు రకం దొడ్లకు కూడా ప్రభుత్వం బోనస్ ఇవ్వాలని సీపీఐ(ఎం) ఏరియా కార్యదర్శి నల్లవల్లి రమేష్ డిమాండ్ చేశారు. మండలంలోని సంజీవన్‌రావు పేట్ గల వరి కొనుగోలు కేంద్రాలను సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాంపేట్, కల్హేర్, సిర్గాపూర్ మండలాలతో పాటు నారాయణఖేడ్‌లోని కొన్ని గ్రామాల ప్రజలు అధికంగా వరిపంట సాగు చేస్తున్నారన్నారు. క్వింటాల్‌కు రూ.2320 మద్దతు ధరను కేటాయించిందని.. దాంతో పాటు సన్న వడ్లకు అదనంగా రూ.500 బోనస్ ఇస్తున్నదన్నారు. సన్నాలతో పాటు దొడ్డు వడ్లకు కూడా బోనస్ ఇవ్వాలన్నారు. అలాగే తేమ పేరుతో క్వింటాల్‌కు రెండు కిలోల తరుగు తీయడం సరికాదన్నారు. రైతులే హమాలి కూలీలకు రూ.45 క్వింటాల్‌కి ఇవ్వాల్సి వస్తుందని, దాంతో రైతుపై భారం పడుతుందని హమాలీ డబ్బులు సీసీఐ కేంద్రాలే భరించాలన్నారు. ఎకరానికి 20 నుండి 25 క్వింటాల్స్ పడుతున్నాయని.. పెట్టుబడి కూడా రావడం లేదన్నారు. కాబట్టి ప్రభుత్వం వడ్ల రేట్లు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు సతీష్, అర్జున్, మైపాల్, రైతులు తదితరులు పాల్గొన్నారు..

అపరిచిత వ్యక్తులకు ఓటీపీ చెప్పొద్దు

నవతెలంగాణ-మనూర్



అపరిచిత వ్యక్తులకు ఓటీపీ చెప్పొద్దని మనూర్ ఎస్ఐ కోటేశ్వర్ రావు సూచిం చారు. సర్వే పేరుతో అపరిచిత వ్యక్తులు వచ్చి ఓటీపీ అడిగితే ఎట్టిపరిస్థితుల్లో వారికి ఎలాంటి ఓటీపీ గానీ, బ్యాంకు ఖాతా సమాచారం గానీ చెప్పి మోసపో వద్దన్నారు. ఉపాధ్యాయులు, ఎన్యూమరేటర్లు మాత్రమే వచ్చి కుటుంబ వివరాలు అడుగుతారన్నారు. కాబట్టి ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి



నవతెలంగాణ-కౌడిపల్లి

హెూటళ్లల్లో నాణ్యమైన ఆహారాన్ని అందించాలని నర్సాపూర్ ఇన్చార్జ్ ఆవుల రాజు రెడ్డి మెదక్ గ్రంథాలయ చైర్మెన్ చిలుముల సుహాసిని రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ధర్మసాగర్ గేటు వద్ద కేజీఎస్ ఫుడ్ కోర్ట్ ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ కేజీఎస్ ఫుడ్ కోర్ట్ ప్రజలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, హెూటల్ ప్రోపరేటర్ సలావుద్దీన్‌కు సూచించారు. రుచికరమైన భోజనాన్ని అందిస్తే ఫుడ్ కోర్ట్ ప్రజల దీవెనలు ఉంటాయని తెలిపారు. సలావుద్దీన్ మాట్లాడుతూ నాణ్యమైన టిఫిన్, రూ.25లు, రూ.99 లకు చికెన్ బిర్యానీ పెడుతున్నామని తెలిపారు. మారుమూల చిన్న గ్రామాల నుంచి ప్రజలు మండలానికి ఎక్కువగా వస్తారని లాభాన్ని ఆశించకుండా తక్కువ రూపాయలతో ఎక్కువ నాణ్యమైన భోజనాన్ని అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్రీనివాసరావు, ప్రవీణ్ రెడ్డి, పాష లక్ష్మణ్ నాయక్ శ్రీనివాస్ గౌడ్, యూత్ నాయకులు కౌడ శ్రీనివాస్ గుప్త, ధన్సింగ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేయాలి

- లోటు పాట్లు ఎదురైతే మా దృష్టికి తేవాలి
- మండల అభివృద్ధి అధికారిని ఉమాదేవి



నవతెలంగాణ-వెల్దుర్తి

సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేయాలని వెల్దుర్తి ఎంపీడీవో ఉమాదేవి అన్నారు. ఆదివారం ఇంటింటి సర్వేలో భాగంగా ఆమె మాట్లాడారు. ఇంటింటి సర్వేను ప్రతి ఒక్కరు విధిగా సమాచారం అందించి సర్వేను విజయవంతం చేయాలని సూచించారు. సేకరించిన సమాచారాన్ని ఎవరు బహిరంగంగా వెల్లడించవద్దని ఇన్యుమానేటర్లకు సూచించారు. అన్ని ప్రశ్నలకు సమాధానం ప్రజల నుంచి సేకరించి బుక్కులేట్లో గోపియంగా నింపాలని సూచించారు. సర్వే సిబ్బందికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు చేయడానికి అన్ని స్థాయిల అధికారులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, తహసీల్దార్ కార్యాల సిబ్బంది, గ్రామపంచాయతీ సెక్రెటరీలు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎక్కడైనా ఎలాంటి సమస్య ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. 15 రోజులపాటు జరిగే ఈ సర్వేకు సర్వే సిబ్బంది ఇంటింటికి వస్తారు, కనుక ఎవరు ఎలాంటి ఆందోళన చెందవద్దని చెప్పారు.

సీఎంపై మాట్లాడే నైతిక హక్కు హరీశ్‌రావుకు లేదు

- కాంగ్రెస్ మండల అధ్యక్షులు మల్లేశం గౌడ్



నవతెలంగాణ-కొల్చారం

సీఎం రేవంత్ రెడ్డిపై మాట్లాడే నైతిక హక్కు మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు లేదని కొల్చారం కాంగ్రెస్ మండల అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శనివారం కొల్చారంలో నిర్వహించిన రైతు దీక్షలో మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డిలు సీఎం రేవంత్ రెడ్డి పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. నీళ్ల, నిధులు, నియమాకాలపై మొదలైన ఉద్యమాన్ని తన స్వప్రయోజనాల కోసం అమాయకమైన ప్రజలను ఉద్యమంలో ఉసిగొల్పి వారి బలిదానాలపై పునాదులు వేసుకొని 9 ఏళ్ళు రాజ్యమేలారని విమర్శించారు. కాంగ్రెస్ తెలంగాణ ఇవ్వకుంటే బీఆర్ఎస్ నాయకులకు పదవులు, ఆస్తులు ఎక్కడివని ప్రశ్నించారు. సునీత లక్ష్మారెడ్డి గతంలో పోలీసులను అడ్డు పెట్టి ఉద్యమ నాయకులను, ఉద్యమం చేసే ప్రజలను, ఉద్యోగులను అరెస్టు చేసి నిర్బంధం పెట్టి రచ్చబండ కార్యక్రమం నిర్వహించిన సంగతి గుర్తుకు లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమాయకమైన ప్రజలను రెచ్చగొడితే ఊరుకునేది లేదని ఖబర్దార్ హరీశ్‌రావు అంటూ హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముత్యంగారి గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి గంగసాని మహేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు దేవన్న గారి శేఖర్, మైనార్టీ సెల్ అధ్యక్షులు సయ్యద్ అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల 10వ జోనల్ క్రీడలకు సర్వం సిద్ధం

- కో ఆర్డినేటర్ సువర్ణ లత

నవతెలంగాణ-మెదక్ టౌన్

మెదక్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల (బాలికల) మైదానంలో సోమవారం నుంచి సిరిసిల్ల జోనల్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్, ప్రిన్సిపల్ సువర్ణ లత తెలిపారు. ఆదివారం మైదానంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు జరిగే పోటీలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. గురుకుల పాఠశాల, కళాశాల రాష్ట్ర కార్యదర్శి అలుగు వర్షిణి ఆదేశాల మేరకు విద్యార్థులకు, సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. కరీంనగర్ రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లోని 13 గురుకులాలు, కళాశాలల నుంచి 1100 మంది విద్యార్థినులు పోటీలకు హాజరవుతున్నారని తెలిపారు. అండర్ 14, 17, 19 మూడు విభాగాల్లో క్రీడలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పరుగు పందెం, డిస్కస్ త్రో, లాంగ్ జంప్, ఐ జంప్, తోపాటు అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయన్నారు. విద్యార్థినులకు, పీఈటీలకు, ఎస్కార్టులకు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కమిటీలను వేశామన్నారు. 13మంది పీడీలు, 13మంది పీఈటీలు పాల్గొంటారని తెలిపారు. క్రీడల నిర్వహణకు 15 కమిటీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

బంజర లెవెన్ క్రికెట్ టీంకు మొదటి బహుమతి



నవతెలంగాణ-మెదక్ టౌన్

మెదక్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వెస్లీ ఛాలెంజర్స్ క్రికెట్ లీగ్ 2024 నిర్వహించిన క్రికెట్ పోటీల్లో 8 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన పోటీల్లో హవేలీ ఘనపురం మండలం బంజారా 11 టీం మొదటి బహుమతి సాధించగా, ద్వితీయ బహుమతి రాయల్ వారియర్స్ మెదక్ గెలుపొందారు. ఈ పోటీలను మెదక్ సాయి టెంట్ హౌస్ ఆధ్వర్యంలో ఒకరోజు క్రికెట్ పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి సాధించిన హవేలీ గణపురం మండలం బంజారా 11 టీం విజయం పట్ల గ్రూప్ సభ్యులు సమిష్టి కృషితో విజయం సాధించినట్లు వారు తెలిపారు. క్రికెట్ కెప్టెన్ పీరియా, వైస్ కెప్టెన్ రామావత్ మైపాల్, సభ్యులు డి. శ్రీనివాస్, డి.సర్దార్, సంతోష్, నరేష్, పాండు, సునీల్, నవీన్, మునియా, వినోద్, అశోక్, రాందాస్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ వివరాలతో సర్వేకు సహకరించాలి

- పంచాయతీ కార్యదర్శి ప్రనీత్ రెడ్డి సూచన



నవతెలంగాణ-బెజ్జంకి

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వేకు కుటుంబ సభ్యుల వివరాలతో ఎన్యూమరేటర్లకు ప్రజలు సహరించాలని పంచాయతీ కార్యదర్శి ప్రనీత్ రెడ్డి ఆదివారం తెలిపారు. నేటి నుంచి ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటిని సందర్శించి సర్వే వివరాలు నమోదు చేస్తారని ప్రజలు తమ కుటుంబ సభ్యుల ఆధార్, రేషన్ కార్డు, భూమి ఉంటే పట్టా వివరాలందించాలని ప్రనీత్ రెడ్డి సూచించారు.

భవాని రెడ్డిని కలిసిన కాంగ్రెస్ శ్రేణులు



నవతెలంగాణ-బెజ్జంకి

వ్యవసాయ శాఖ కమీషన్ సభ్యురా లిగా నియామకమైన భవాని రెడ్డిని హైదరాబాద్‌లో ఆదివారం మర్యాదపూ ర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శాలువాతో సన్మానించినట్టు ఆర్టీఐ ప్రచార కమిటీ చైర్మన్ రాసూరి మల్లికార్జున్ తెలిపారు. ఎలాంటి అంక్షల్లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ రైతులకు వర్తింపజేయాలని కాంగ్రెస్ శ్రేణులు భవాని రెడ్డికి విజ్ఞప్తి చేసినట్టు మల్లికార్జున్ తెలిపారు. సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి, చైర్మన్ కోదండ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ దృష్టికి తీసుకువెళ్తానని భవాని రెడ్డి వెల్లడించినట్టు మల్లికార్జున్ తెలిపారు. గాదం స్వామి, పులి రమేశ్, గాదం మల్లికార్జున్ పాల్గొన్నారు.

మూఢనమ్మకాలపై సమరం

- చేతబడి, బాణామతి, మంత్రాలపై ప్రదర్శనలు ముమ్మరం



నవతెలంగాణ-తూప్రాన్

ప్రజలు మూఢనమ్మకాలను పెట్టుబడిగా మంత్ర తంత్రాలు గుప్తనిధులంటూ నమ్మించి నట్టేట ముంచే మంత్రగాళ్ల నుంచి ప్రజలను కాపాడేందుకు మెదక్ జిల్లా పోలీసులు విస్తృత కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మెదక్ జిల్లా పరిధిలో రోజురోజుకు పెరిగిపోతున్న అసాంఘిక దురాచారాల పట్ల చైతన్యం వచ్చేందుకు సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ వారితో మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి బాణామతి, చేతబడి, మంత్రాలపై జిల్లా వ్యాప్తంగా ప్రదర్శనలు ఇప్పిస్తున్నారు. ప్రస్తుత సమాజంలో శాస్త్ర విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్నా, ఇప్పటికీ గ్రామాల్లో మంత్రాలు, చేతబడి, బాణామతి, క్షుద్ర పూజలు, దయ్యాల భూతాల పేరుతో అమాయక ప్రజలని మోసం చేయడం దురదృష్టకరమని తెలుపుతున్నారు. ఓవైపు విద్యార్థుల్లో, మరోవైపు ప్రజల్లో రోజురోజుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తూ చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మూఢనమ్మకాలతో గ్రామాల్లో జరిగిన అసాంఘిక సంఘటనలు రామాయంపేట మండల పరిధిలోని కాట్రియాల గ్రామంలో చేతబడి చేస్తుందని అనుమానంతో వృద్ధురాలిపై పెట్రోల్ పోసి కాల్చి చంపేసిన సంఘటన ఉమ్మడి జిల్లాలో సంచలనం సృష్టించింది. తూప్రాన్ మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో చేతబడి చేస్తున్నారని నెపంతో ఒకే కుటుంబానికి చెందిన స్వామి కుటుంబ సభ్యులు ముగ్గురిపై దాడి చేశారు. గతంలో అల్లాదుర్గం మండల కేంద్రంలో మంత్రాలు బాణామతి చేస్తున్నారని నెపంతో కరెంట్ స్తంభానికి కట్టేసి దాడి చేశారు. మెదక్ రూరల్ పరిధిలోని పాతూరులో మంత్రాలు, చేతబడి చేస్తున్నారని భయాందోళనలో గ్రామ ప్రజలు ఉన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా మెదక్ జిల్లా పరిధిలో 44 గ్రామాల్లో మంత్రాలు, చేతబడి, బాణామతి క్షుద్ర పూజల పేరుతో దాడులు, హత్యలు జరిగాయి.

మెదక్ జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ప్రదర్శనలు



ఇలాంటి మూఢనమ్మకాలు బలంగా ఉన్న గ్రామాల్లో సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ వారు ప్రదర్శనలు ఇస్తున్నారు. ఇప్పటికే రామాయంపేట మండలంలోని కాట్రియాల, ప్రగతి ధర్మారం, ఝాన్సీ లింగాపూర్, లక్ష్మీపూర్, టేక్మాల్ మండలంలోని గొల్లగూడెం, హవేలీఘన్పూర్ మండలంలోని ఔరంగాబాద్, వెల్దుర్తిలోని జలాల్పూర్ తండా, నార్సింగ్‌లోని పెద్దతండా, కౌడిపల్లిలో మహమ్మద్ నగర్, అల్లాదుర్గంలోని గుడి పెద్దాపూర్, తూప్రాన్‌లోని కిష్టాపూర్ పూర్తికాగా జిల్లాలోని 33 గ్రామాల్లో రోజుకో గ్రామంలో ఇంద్రజాల ప్రదర్శనలు ఇస్తున్నారు.

పచ్చివేపాకులపైన మంటలు మండించడంతో కిష్టాపూర్ గ్రామ ప్రజలందరూ ఆసక్తిగా తిలకించారు. వాస్తవానికి పచ్చివేపాకులపై కార్బైట్ వేసిన తర్వాత ఎన్ని నీళ్ల పోస్తే అంత పెద్దగా మంటలు వ్యాపిస్తాయని ప్రజల ముందు ప్రదర్శన చేస్తూ నరేష్ నిరూపించారు. ఇలాంటి మోసపూరిత నమ్మలేని విద్యలతోనే భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని అదునుగా చేసుకొని ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటినుంచి అయినా ప్రజలు మూఢనమ్మకాలను విశ్వసించకూడదని, నమ్మకూడదని, భూతవిద్యాలన్నీ బూడిద విద్య లేనని ప్రజలు సంతోషకరమైన వాతావరణంలో జీవించాలని కోరారు.

గ్రామాల్లో చేసే ప్రదర్శనలతో ప్రజలలో మార్పులొస్తాయి



కిష్టాపూర్‌లో పచ్చి వేపాకులపై నీళ్లతో మంటలు లేపగా, ఇనుప సువ్వను నాలుకకు గుచ్చుకోని చూయిస్తే ప్రజలంతా ఆశ్చర్యపోయారు నిజం చెప్పగానే నవ్వుకున్నారు. ఇలాంటి ప్రదర్శనల వల్ల మూఢవిశ్వాసాలు బాగా తగ్గుతాయి. జిల్లా వ్యాప్తంగా కళాశాలలో, పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు విస్తృతమైన ప్రచారం కల్పిస్తూ, ప్రదర్శనలు ఇప్పిస్తున్నామని డీఎస్పీ వెంకట్ రెడ్డి తెలిపారు.

తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి

వాటిని నిరూపిస్తే రూ.10 లక్షలిస్తాం



బాణామతి, మంత్రాలు, చేతబడి ఉందనుకుంటే ఆనాడు రాజులు యుద్ధాలు ఎందుకు చేస్తారు..? మంత్రాలతో శత్రువులను మట్టి కరిపించొచ్చుకదా మంత్రాలు, చేతబడి బాణామతి క్షుద్ర పూజలు ఉన్నాయని శాస్త్రీయంగా నిరూపిస్తే సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ తరపున రూ.10 లక్షలు ఇవ్వడానికి సిద్ధం, పచ్చివేపాకులపై మంటలు లేపిన నరేష్

సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యులు ఉప్పులేటి నరేష్



భవిష్యత్తు తరాలకు వ్యవసాయం తప్పనిసరి



- రామానాయుడు విజ్ఞాన జ్యోతి వ్యవస్థాపకులు డాక్టర్ సురేష్ బాబు

నవతెలంగాణ-కౌడిపల్లి

భవిష్యత్ తరాలకు వ్యవసాయం తప్పనిసరని రామానాయుడు విజ్ఞాన జ్యోతి వ్యవస్థాపకులు, సినీ నిర్మాత డాక్టర్ సురేష్ బాబు పేర్కొన్నారు. కౌడిపల్లి మండలం తునికిలోని రామానాయుడు విజ్ఞాన జ్యోతి విద్యాసంస్థల పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సురేష్ బాబు హాజరై మాట్లాడుతూ దేశం బాగుండాలంటే గ్రామాలు బాగుండాలన్నారు. 2004లో గ్రామీణ పేద విద్యార్థుల కోసం రామానాయుడు అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ ఎంతోమంది పేద విద్యార్థులు శిక్షణ పొంది ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. గ్రామాల నుంచి వ్యవసాయం మానేసి పట్టణాలకు వలస వెళ్లడం అక్కడి కలుషిత నీరు, గాలి ఎక్కువై రోగాల బారిన పడుతూ విసిగి వేసారి మళ్లీ గ్రామాలకు చేరి వ్యవసాయం ఎంచుకుంటున్నారని తెలిపారు. రామానాయుడు విజ్ఞాన జ్యోతి కళాశాలలో చదువుకున్న విద్యార్థిని విద్యార్థులు తమ గ్రామాలకు వెళ్లి వ్యవసాయంపై తాము నేర్చుకున్న వాటిపై తోటి రైతులకు అవగాహన కల్పించి లాభసాటి వ్యవసాయం వైపు మొగ్గు చూపేలా కృషిచేసినప్పుడే వారికి కళాశాలకు మంచి పేరు వస్తుందన్నారు. ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయంపై మొగ్గుచూపితే రాబోయే తరానికి ఆరోగ్యవంతమైన ఆహారాన్ని అందించిన వారవుతారని తెలిపారు. వ్యవసాయం గురించి దేశంలో అన్ని ప్రభుత్వాలు మాట్లాడుకోవడం సహజమే అన్నారు. రానున్న రోజుల్లో వ్యవసాయమే కీలకంగా మారుతుందని దీన్ని ప్రతి ఒక్కరు గుర్తించి వ్యవసాయంపై ఆసక్తి చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో రామానాయుడు డైరెక్టర్ అర్జున్ రావు, జనరల్ సెక్రెటరీ దుర్గాప్రసాద్, అడ్వైజరీ కమిటీ చైర్మెన్ అచ్యుత్ రాంప్రసాద్, డిప్యూటీ సీఈఓ సంజయ్ కుమార్, జగదీష్, విద్యార్థినీ విద్యార్థులు ఉన్నారు.

కుటుంబ సర్వే వివరాల నమోదులో తప్పులు ఉండొద్దు

- తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి





నవతెలంగాణ-వెల్దుర్తి/తూప్రాన్

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎన్నిమరిటర్లు ఎలాంటి తప్పులకు తావు లేకుండా పూర్తి వివరాలు నమోదు చేయాలని తూప్రాన్ ఆర్డిఓ జై చంద్ర రెడ్డి అన్నారు. ఆదివారం మాసాయిపేట మండలంలో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను పరిశీలించారు. రెండో రోజు వివరాలు సేకరుల్లో ఏమైనా ఇబ్బందులు కలుగుతున్నాయి. అని ఎన్యుమనేటర్లును అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులు ఉంటే పర్యవేక్షకులు ప్రత్యేక అధికారులు దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎన్యుమనేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకం,లోని సమగ్ర సమాచారం అందించి సహకరించాలన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధికి సర్వే ఉపయోగపడుతుందన్నారు. వీరి వెంట తహసీల్దార్ జ్ఞానజ్యోతి పంచాయితీ సెక్రెటరీ పాల్గొన్నారు.

చోరికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

- ఎస్సై రాజు

నవతెలంగాణ-వెల్దుర్తి

మండల కేంద్రానికి చెందిన లక్ష్మి లక్ష్మణ్ ఆదివారం ఇంటికి తాళాలు వేసి రోజువారీ లాగే పనులు నిమిత్తం వ్యవసాయ పొలం పనులకు వెళ్లారు. పనులు ముగించుకొని ఇంటికి వచ్చేసరికి తాళాలు పగలగొట్టి ఉండడం చూశారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో నుంచి రూ.25 వేల నగదు చోరి గురి అయినట్లు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్సై రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో పక్కనే ఉన్న ఇంట్లో కిరాయికి ఉన్న విజయ్ అనే వ్యక్తి అనుమానంతో విచారించగా నేనే దొంగిలించినట్లు ఒప్పుకోవడంతో నగదును స్వాధీనం చేసుకొని రిమాండ్ చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఆయన తెలిపారు.




నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి దారి ఏది..?

- అధికార, ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం

నవతెలంగాణ-గజ్వేల్

మల్లన్న సాగర్ నిర్వాసితుల సమస్యల పరిష్కారం అంశంపై ప్రభుత్వం, ప్రతిపక్షాలు దుమ్మెత్త పోసుకుంటున్నాయి. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని సంగాపూర్, నట్రాజ్ పల్లి గ్రామాల మధ్య కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని నిర్వాసితులు కోరుతున్నారు. ప్రాజెక్టుకు భూసేకరణపై చూపిన శ్రద్ధ సదుపాయాల కల్పించడం చూపడం లేదని విమర్శలు ఉన్నాయి. సంగాపూర్, నట్రాజ్ పల్లి సమీపంలో దాదాపు 6 ఎకరాల్లో గ్రామాలను పునర్నిర్మించారు. పలువురికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రతి లబ్ధిదారునికి వ్యక్తిగతంగా నిర్మాణం చేపట్టి ఇచ్చారు. అంతేకాకుండా ఇంటి స్థలాలు తీసుకొని నిర్మించుకుంటున్నారు. కాలనీలో మురుగునీరు కాలువ నిర్మాణం సరిగ్గా లేదు. కాలనీలో మురికి కాలువలు చాలావరకు పగిలిపోయాయి. మురుగు కాలువలో చెత్త పేరుకు పోయింది. బస్తీ దావఖానలు, అంగన్‌వాడీ భవనాలు నిర్మించిన అవి అందుబాటులోకి తీసుకురాలేదు. అంతేకాకుండా తాగునీటి రక్షిత పథకాలు పూర్తిగా కాలేకపోయాయి. దీంతో వినియోదారులు ఇబ్బందులు గురవుతున్నారు. అనేకసార్లు కలెక్టర్లకు, ఆర్డీవోలకు, తహసీల్దారులకు వినతి పత్రాలు ఇచ్చిన సమస్యలు పరిష్కారం కావడంలేదని నిర్వాసితులు ఆవేదన చెందుతున్నారు. వేముల గట్టు గ్రామంలో ఇప్పుడు దాకా 800 ఇండ్ల స్థలాలుకాగా408 ఇల్లు మాత్రమే ఇచ్చారు. గత వారంలో కలెక్టర్‌కు ఈ విషయం ప్రజావాణిలో అనేకమంది వృద్ధులు వినతి పత్రాలు అందించారు. 18 ఏండ్లు దాటిన వారు, 65 ఏండ్లు దాటిన వారికి రావలసిన రూ.7.50 లక్షల ప్యాకేజీ ఇప్పటివరకు అందలేదని చెప్పుకొస్తున్నారు. కొండపోచమ్మ సాగర్ నిర్మాణం సందర్భంగా నిర్వాసితులకు పూర్తి న్యాయం జరగలేదు. మామిడాల, బలిపురం, తానేదారిపల్లి, తండా గ్రామాలను తునికు బొల్లారం సమీపంలో పునర్నిర్మానం కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నాయి. ఇక్కడ కూడా అనేక సమస్యలు ఉన్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు నిర్వాసితులు కురిపించిన వాటిని అమల చేయలేకపోతుందని నిర్వాసితులు ఆవేదన చెందుతున్నారు.





మళ్లీ విజృంభిస్తున్న రోడ్డు ప్రమాదాలు

- పాత జ్ఞాపకాలు గుర్తు చేస్తున్న రాజీవ్ రహదారి
- ఏడాదిలో 190 మంది మృతి

నవతెలంగాణ-గజ్వేల్

రాజీవ్ రహదారిపై రోడ్డు ప్రమాదాలు మళ్లీ విజృంభిస్తున్నాయి. పాత జ్ఞాపకాలను గుర్తు చేస్తున్నాయి. రహదారి వెడల్పు అయినప్పటికీ ప్రమాదాలు కొంతకాలం తగ్గిన ఈ ఏడాది అక్టోబర్ నాటికి 190 మంది వివిధ ప్రాంతంలో మృతి చెందారు. 2023 నుంచి 2024 అక్టోబర్ నాటికి ఈ సంఘటనలు జరిగినాయి. 2023లో 540 ప్రమాదాలు జరగగా 260 మంది చనిపోయారు. 480 మందికి క్షతగాత్రులుగా మిగిలారు. 2024 అక్టోబర్ నాటికి 412 ప్రమాదాలు జరగగా 190 మంది మృతి చెందారు. 456 మంది క్షతగాత్రులుగా గుర్తించారు. జిల్లాలో రహదారులు రక్తంతో తడుస్తు అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులు దిక్కులేని వారు అవుతున్నారు. అధిక వేగం రోడ్డు నిబంధనలు పాటించకపోవడం కొందరు మద్యం మత్తులో వాహనాలు నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణం అవుతుంది. జిల్లా మీదుగా వెళ్లే రాజీవ్ రహదారిపై అధికంగా ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారి చాలా చోట్ల గ్రామాలకు రెండుగా చీల్చుతూ మధ్యలో నుంచి వెళ్ళింది. వందల నిర్మాణాలు కలగానే మిగిలాయి. ములుగు మండలం వంటిమామిడి, ములుగు, గౌరారం, ప్రజ్ఞాపూర్, రిమ్మనగూడ, కొడకండ్ల, కుక్కునూరు పల్లి సహా జిల్లాలోని 25 గ్రామాలను చీల్చుతూ ఈ రోడ్డు ఉన్నది. ప్రజలు దాటేటప్పుడు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో బ్లాక్ స్పాట్లను 22 చోట్ల గుర్తించారు.



ఎక్కువగా ప్రమాదంలో జరుగుతున్న స్థలాలు ఇక్కడే

వంటిమామిడి మలుపు, గౌరవరం వర్గం కమాన్, రానే బ్రేక్ లైన్ పరిశ్రమ, తిమ్మారెడ్డిపల్లి మలుపు, కొడకండ్ల, కొమరవెల్లి చౌరస్తా, దుద్దెల మలుగు, సిద్దిపేట శివారు దాబాల చోటా బాగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇది పోలీసులు గుర్తించి కొన్ని చర్యలు కూడా తీసుకున్నారు. రాజ్ రహదారిపై 80 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో వాహనాలు నడిపిస్తున్నారు. దారిపొడువున 15 కిలోమీటర్లకు ఒక పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికీ ఎక్కడ వేగం నియంత్రణ సీసీ సూచికలు పాటించడం లేదు. ప్రతి ఏడాది సుమారు 700 పైగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పోలీస్ స్టేషన్లో 40 శాతం పైగా రోడ్డు ప్రమాదాలే జరుగుతున్నాయి. లారీలు, కారులు, ఆటోలు, డివైడర్ ఎత్తు తక్కువగా ఉండటంతో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, కరీంనగర్ నుంచి హైదరాబాద్ వరకు పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా తల్వాట్ల వద్ద రహదారిపై సరి అయిన ప్రమాద హెచ్చరికలు సూచిక బోర్డు లేకపోవడం వల్లే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆయా గ్రామాల ప్రజలు భావిస్తున్నారు. ఏది ఏమైనా ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.





ఇంటింటి సర్వేను పరిశీలించిన తహశీల్దార్



నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండల ంలో పలు గ్రామాలతో పాటు వెలికట్టలో జరుగుతున్న సామాజిక, రాజకీయ కుల గణన ఇంటింటి సర్వే ను తహశీల్దార్ దిలీప్ నాయక్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివారం సెలవు రోజైనప్పటికి సర్వే జరుగుతుం దన్నారు. ఇంటింటికి ఎన్యుమరేటర్లు వెళ్లి సమాచారం సేకరించి నమోదు చేస్తున్నారన్నారు. ఇంటి వద్ద ఉండి వివరాలను అందించి సహకరించాలని పిఏసిఎస్ డైరెక్టర్ సురేందర్ రావు తెలిపారు.

ఎమ్మెల్సీగా సీపీఎస్ అభ్యర్థిని గెలిపించుకోవాలి

- రాష్ట్రాధ్యక్షుడు దాముకి కమలాకర్ పిలుపు



నవతెలంగాణ-బెజ్జంకి

ఎన్నికల్లో ఎమ్మెల్సీగా సీపీఎస్ అభ్యర్థిని గెలిపించుకోవాలని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘం రాష్ట్రాధ్యక్షుడు దాముకి కమలాకర్ పిలుపునిచ్చారు. దాముకి కమలాకర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామంచ రవీందర్‌తో కలిసి మండలంలోని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగులను ఆదివారం సందర్శించారు. సీపీఎస్ విధానం రద్దుకు గత ఎమ్మెల్సీ పట్టించుకోలేదని. ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా సీపీఎస్ అభ్యర్థిని గెలిపించుకుని సీపీఎస్ రద్దుకు దోహదపడాలని కమలాకర్ కోరారు.

బాధిత కుటుంబాలకు ఎల్‌ఓసీ అందజేత



నవతెలంగాణ-చేర్యాల

మండల పరిధిలోని కడవేరుగు గ్రామానికి చెం దిన జంగ ఆశయ్యకు ఇటీవ ల జరిగిన రోడ్డు ప్రమాద ంలో కాలుకు తీవ్ర గాయం కావడంతో నడవలేని పరిస్థితిలో ఉండగా కాలు ఆపరేషన్ కోసం, అలాగే చిట్యాల గ్రామానికి చెందిన నాగారం పోషయ్య కాలుకు తీవ్రమైన ఇన్ఫెక్షన్ కావడంతో ఇరువురి చికిత్సలకు పెద్ద మొత్తంలో డబ్బులు అవసరం కాగా స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ వెంటనే బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి ఇరువురికి చెరో రూ.2 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. మంజూరు పత్రాలను ఆదివారం ఆయా గ్రామాల్లోని బాధితులకు కిరణ్ కుమార్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఎల్ఓసీ మంజూరు చేయించిన మంత్రికి, కిరణ్ కుమార్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు ఆది శ్రీనివాస్, గ్రామ అధ్యక్షులు బాగోతం బాలచందర్, యూత్ అధ్యక్షులు నీరటి విజయ్, కొమురవెల్లి దేవస్థానం కమిటీ మాజీ డైరెక్టర్ తాల్లపల్లి రమేష్, నియోజకవర్గ ఓబీసీ సెల్ చైర్మెన్ జానకి స్వామి, యాదగిరి, మోకు మల్లారెడ్డి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి అండగా కాంగ్రెస్

- ఫార్మర్స్ ఫస్ట్ చైర్మెన్ చక్రధర్ గౌడ్
- 10 వేల ఆర్థిక సాయం



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు గ్రామానికి చెందిన నిరుపేద గౌరబోయిన శ్రీనివాస్ అనారోగ్యంతో ఇటీవ ల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు చక్రధర్ గౌడ్ అండగా నిలిచారు. నంగునూరు మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గోనెపల్లి శివప్రసాద్ గౌడ్ మృతుని కుటుంబ పరిస్థితి ఫోన్‌లో ఆయనకు వివరించారు. ఆ కుటుంబానికి అండగా చక్రధర్ గౌడ్ పంపిన రూ.10 వేల ఆర్థిక సాయాన్ని వారి కుటుంబానికీ ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గౌరబోయిన సంపత్ కుమార్, గౌరబోయిన రాజు, చింతల రాజు, చింతల నవీన్, గుండబోయిన సాయిరాం, గౌరబోయిన సతీశ్, ముదిరాజ్ సంఘం పెద్దలు, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంచార్జి ఎంపీడీవోగా ప్రభాకర్ రావు

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల ఇంచార్జి ఎంపీడీవోగా వి.ప్రభాకర్ రావును నియమిస్తూ సీఈవో ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం ఎంపీడీవో విధులు నిర్వహిస్తున్న బి.లక్ష్మప్ప సెలవుపై వెళ్ళారు. కుటుంబ సర్వే జరుగుతుందనే ప్రాముఖ్యత దృష్ట్యా మరొకరికి బాధ్యతలు అప్పగించారు. ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ప్రభాకర్ రావుకు ఇంచార్జి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



నవతెలంగాణ-కొండపాక

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక ఆర్థిక రాజకీయ కుల గణన కార్యక్రమాన్ని సమర్థ వంతంగా నిర్వహించాలని కుకునూ ర్‌పల్లి తహసీల్దార్ మల్లికార్జున్ రెడ్డి, ఎంఇఓ బి.సత్తయ్య సూచించారు. కుకునూరుపల్లి మండలం లకుడారం, మెదినీపూర్ గ్రామాల్లో జరుగుతున్న సర్వే తీరును ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. నమోదు చేయడంలో సందేహాలుంటే పై అధికారులకు తెలపాలన్నారు. ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు వివరాలు అందించి సహకరించాలని ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ సిహెచ్.రవి ఎన్యుమరేటర్లున్నారు.

మృతుని కుటంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్

- ఆడెపు ఎల్లయ్య మరణం బాధాకరం



నవతెలంగాణ-తొగుట

మండలంలోని వెంక ట్రావుపేట గ్రామానికి చెందిన ఆడెపు ఎల్లయ్య (80) అకాల మరణం కలిచివేసిం దని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి విచారం వ్యక్తం చేశారు. కొద్దిరోజు లుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందారు. ఎల్లయ్య మృత దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు సిరిసిల్ల రాజేష్, బండారు స్వామి గౌడ్, పాత్కుల బాలేష్, ఎంగలి రాములు, రాంబాబు, మిద్దె శ్రీకాంత్, శ్రీనివాస్, రాజు తదితరులు ఉన్నారు.

వరి కొయ్యలను కాలిస్తే పర్యావరణానికి ముప్పు





నవతెలంగాణ-రాయపోల్

వరి కొయ్యలను కాలిస్తే పర్యావరణానికి, వ్యవసాయానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని దొమ్మాట వ్యవసాయ విస్తరణ అధికారి సంతోష్ కుమార్ అన్నారు. వరి కొయ్యలను కాలిస్తే కలిగే ముప్పు వలన పరిణామాల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వ్యవసాయంలో ప్రస్తుతం కూలీల కొరత ఉండటంతో రైతులు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. వరి కోతలకు హార్వెస్టర్లను వినియోగిస్తుండటంతో గడ్డి వినియోగం తగ్గిపోయింది. పశుసంపద ఉన్న వారు గడ్డిని సేకరిస్తుండగా మిగతావారు. అలాగే పొలంలో వదిలేస్తున్నారు. తదుపరి పంటకు పొలాన్ని సిద్ధం చేసే క్రమంలో వరి కొయ్యలతో పాటు, గడ్డిని దహనం చేస్తున్నారు. అన్నదాతలు అవగాహన లోపంతో చేస్తున్న ఈ చర్యతో భూమిలోని అవశేషాలు, ఖనిజలవనాలు నశిస్తాయి. భూసారానికి ముప్పు పొంచి ఉందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు.

కలియ దున్నితే ఎన్నో ప్రయోజనాలు

వరి కొయ్యలు నేలలో కలియదున్నడం వల్ల సేంద్రీయ కర్బన శాతం పెరిగి దిగుబడులు 5 నుంచి 10 శాతం పెరిగే అవకాశం ఉంది. దుక్కి దున్నే సమయంలో సూపర్ ఫాస్పెట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి. ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది. కలియ దున్నితే ఎకరాకు దాదాపుగా టన్ను ఎరువు తయారు అవుతుంది. మొక్కలకు 2 శాతం నత్రజని, 4 శాతం పాస్పరస్ అదనంగా అందిస్తుంది. జింక్, మాంగనీసు, ఇనుము, కాల్షియం లాంటి సూక్ష్మధాతువులు అంది పంటకు మేలు చేకూర్చుతాయి. నేలలో కరుగని మూలకాలను అనుకూలంగా మార్చుతుంది. నీటి నిల్వ పెరుగుతుంది. టన్ను గడ్డి కావాలంటే వరి పెరుగుదలకు 18.9 కిలోల పొటాషియం, 6.2 కిలోల నత్రజని, 1.1కిలోల భాస్వరంతో పాటు కొంత మోతాదులో సూక్ష్మ పోషకాలు అవసరం అవుతాయి. కొయ్యకాళ్లను భూమిలో కలియదున్నితే గడ్డి ద్వారా పోషకాలు తిరిగి నేలకు చేరుతాయి. పొలం దున్నే పది రోజుల ముందు గడ్డిని పొలంలో పరిచి నీరు అందించాలి. తర్వాత ఎకరాకు 50 కిలోల సూపర్ పాస్పెట్ చల్లాలి. దీంతో భూమి దెబ్బతినడం నుంచి తప్పించడమే కాకుండా భూమిలో సేంద్రీయ పదార్థాల స్థాయిని పెంచవచ్చు. ఈ పద్ధతి పాటించడం వల్ల నీటి నిల్వ చేసుకునే సామర్థ్యం పెరిగి దిగుబడి అవకాశాలు మెరుగుపడుతాయి.

నిప్పు పెట్టడం వల్ల కలిగే నష్టాలు

వరి కొయ్యలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం పెరుగుతుంది. విపరీతమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా నత్రజని, పాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం, దిగుబడి తగ్గిపోతుంది. భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి. మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయి. పొలాల్లో తిరిగే పాములు, ముంగీసలు, ఉడుములు, నెమళ్లు, తొండలు ఇలా అనేక రకాల జీవరాశులు చనిపోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది. గట్లు, మొరం గడ్డలపై ఉన్న పచ్చని చెట్లు కూడా ఒక్కోసారి బుగ్గిపాలవుతున్నాయి. ఆలస్యంగా కోతకు వచ్చే పంటలు, కల్లాలు దగ్గరే ఉంటే ధాన్యం కాలిపోయే ప్రమాదం ఉంది.

బీడీ కార్మిక సమస్యలపై ఏఐటీయూసీ నిరంతర పోరాటం



- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్ రాజు

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల సాధనకు ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్ అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో జరిగిన బీడీ కార్మిక సంఘం జిల్లా రెండో మహాసభలకు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిరంగారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి హాజరైన బాలరాజ్ మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలో వెట్టి చాకిరికి గురవుతున్న బీడీ కార్మికులకు కనీస వేతనం జీవో అమలు చేయాలని, పాత పద్ధతి ప్రకారం కార్మికులకు నేరుగా నగదు పంపిణీ అమలుపరచాలని, అర్హులైన కార్మికులందరికీ ఇండ్లు ఇంటి స్థలం కోసం రూ.10లక్షల ఆర్థిక సాయం అందించాలని, బీడీ పరిశ్రమపై పలుమార్లు పెంచుతున్న జీఎస్టీ పనులను వెంటనే తగ్గించాలన్నారు. నెల 26 రోజుల పనిని కల్పించి బీడీలకు సరిపడా తుని కాదు. తంబాకు దారం తదితర ముడి సరుకు కంపెనే సరఫరా చేయాలని, కేంద్ర ప్రభుత్వం బీడీ కార్మిక సంక్షేమ ఆసుపత్రికి తగిన నిధులు కేటాయించి సంక్షేమ పథకాలైన బీడీ స్కాలర్షిప్ ఇండ్ల నిర్మాణంకు ఆర్థిక సాయం ఇతర పథకాలను యధావిధిగా కొనసాగించాలన్నారు. ఎన్నికలలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం బీడీ పరిశ్రమలోని అన్ని రకాల కార్మికులకు ప్యాకర్స్, సేకర్స్, బట్టి వాళ్లకు కమిషన్ ఏజెంట్లకు రూ.4016 ఎలాంటి నిబంధన లేకుండా జీవన భత్యం ఇవ్వాలని, ఈఎస్ఐ సిద్దిపేట ఆసుపత్రిని కనీస వసతులు కల్పించి, గతంలో బీడీ పరిశ్రమను నిర్వీర్యం చేసే కార్మికుల పొట్టగొట్టే కొత్త చట్టాన్ని పోరాటాల ద్వారా నిలిపివేయడం జరిగిందన్నారు. ఈపీఎఫ్ఓ సంస్థలో పీఎఫ్‌కు రాజీనామా అనంతరం బీడీ కార్మికులకు కనీస పెన్షన్ రూ.6వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఉన్న పీఎఫ్ ఆఫీసును ఎట్టి పరిస్థితుల్లో తరలించారాదని కోరారు. తరలించిన యెడల కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గోవర్ధన్, సుతారి రాములు, రాష్ట్ర నాయకులు ఎండి.ముక్రం, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షులు అందె అశోక్, జిల్లా నాయకులు దీకొండ శ్రీనివాస్, బెక్కంటి సంపత్, ఈరి భూమయ్య, వలబోజు నరసింహ చారి, హరికృష్ణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణాన్ని కలుషితం చేస్తున్నది ఎవరు..?

- కాంగ్రెస్ కౌన్సిలర్ సాకి బాల్ లక్ష్మి ఆనంద్



నవతెలంగాణ-సిద్దిపేట

సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు నాయకత్వంలో వేడుకలను నిర్వహించుకునే వెళ్తుండగా, మాజీ సుడా చైర్మెన్ రవీందర్ రెడ్డి తన అనుచరులతో హరీశ్‌రావుకు అడ్డు ఎవడు అంటూ నినాదాలు చేశారని, సిద్దిపేట ప్రశాంత వాతావరణన్ని కలుషితం చేస్తున్నది ఎవరని కాంగ్రెస్ కౌన్సిలర్ సాకి బాలలక్ష్మి ఆనంద్ ప్రశ్నించారు. ఆదివారం 37వ వార్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ప్రజాప్రతినిధులు రాజనర్సు, సాయిరాం, కౌన్సిలర్ బ్రహ్మం తమ స్థాయిని మరిచి మైనంపల్లి పై వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. సీఎం జన్మదిన వేడుకలు విజయవంతం కావడంతో హరీశ్‌రావుకు భయం పుట్టుకు వచ్చిందని, ప్రతిపక్ష నాయకులు లేకుండా చేయడం కోసమే గతంలో తాను ఒక్కడినే కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్‌గా గెలిస్తే మా ఇంటికి వచ్చి హరీశ్‌రావు కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి చేర్చుకున్నారని అన్నారు. సిద్దిపేటకు నిధులు తేవాలని మైనంపల్లిని అంటున్న బీఆర్ఎస్ నాయకులు, గత పదేండ్లుగా 37వ వార్డుకు నిధులు కావాలని అడిగితే ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పట్టణంలో ఇతర వార్డులలో కోట్ల రూపాయలతో అభివృద్ధి జరిగితే, అంబేద్కర్ నగర్‌లో ఎంత ఖర్చు చేశారో వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. డబ్బున్న వ్యక్తులకే దళిత బంధు ఇచ్చారని ఆరోపించారు. నాకు అవకాశం ఉన్నప్పటికీ నా ఇంటివారికి దళిత బంధు ఇవ్వలేదని అన్నారు. ఇప్పటికైనా ఆరోపణలను చేయడం ఆపేసి, వాస్తవాలను మాట్లాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధు, రఘు, భూమలింగం, నటరాజ్, శ్రీనివాస్, రవి, రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేయాలి

- బీఆర్ఎస్ జిల్లా నాయకులు నేతి చిన్న సంతోష గుప్తా



నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు 11 నెలలైనా అమలు కావడం లేదని వెంటనే అమలు చేయాలని బీ ఆర్ఎస్ జిల్లా యూత్ నాయకులు నేతి చిన్న సంతోష్ గుప్త అన్నారు. ఆదివారం ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారం కోసం విచ్చలవిడిగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సైతం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉచిత బస్సు ప్రయాణానికి అనుకూలంగా బస్సులు లేవని అన్నారు. రూ500లకే గ్యాస్ ఇస్తున్నామని చెప్పిన కాంగ్రెస్ ఇది అందరికీ అమలు కావడం లేదన్నారు. 200 యూనిట్ల విద్యుత్ సైతం కొందరికే పరిమితమైందన్నారు. రూ.2 వేల నుంచి రూ.4 వేల పెన్షన్ ముచ్చట కాంగ్రెస్ మర్చిపోయిందన్నారు. మూసి నది, కుల గణన పేరిట ప్రజలను ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తుందన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు వెంటనే అందించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను మభ్యపెడుతుందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు పెట్టుబడి వెంటనే రైతులకు అందించాలని కోరారు. అన్ని సామాజిక వర్గాలకు ప్రభుత్వం పెద్దపీట వెయ్యాలని కోరారు.

వాసవి వనిత క్లబ్‌కు పలు అవార్డులు



నవతెలంగాణ-సిద్దిపేట

తాము చేసిన సేవలకు పలు అవార్డులు వచ్చినట్లు వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు మర్యాల వాణి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ హైదరాబాద్ క్రిస్టల్ గార్డెన్‌లో జిల్లా ప్రాంతీయ సదస్సు భానూరి విజయోత్సవ సమావేశంలో బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డ్, అత్యధిక సేవా కార్యక్రమాలు చేసినందుకు అవార్డు, క్యాలెండర్స్ ఆఫ్ ఈవెంట్స్ అవార్డు, సీడ్ బాల్స్ ఇలైట్ రికార్డ్ అవార్డు, గో సేవ అవార్డు, గవర్నర్ అఫీషియల్ అవార్డు, డాన్ టు డస్క్ అవార్డుతో పాటు మొత్తం 9 అవార్డులను అందుకున్నట్లు తెలిపారు.

బాలల బంగారు భవిష్యత్తును కాపాడాలి

- జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబోయిని నర్సింహులు



నవతెలంగాణ-గజ్వేల్

బాల్యవివాహలను నిర్మూలించి, బాలల బంగారు భవిష్యత్తును కాపాడాలని జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబోయిని నర్సింహులు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాల్యవివాహలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని తెలియజేశారు. యువజన సంఘాలు స్వచ్ఛంద సంస్థలు సంబంధిత అధికారులు బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాల గురించి తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. 18 ఏండ్ల లోపు బాలికలకు, 21 ఏండ్ల లోపు అబ్బాయిలకి వివాహం చేస్తే పెళ్లి కుమారునికి వారి తల్లిదండ్రులకు, పెళ్లిలో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరిగుతుందన్నారు. మైనర్ బాలికను వివాహం చేసుకొని తనతో సంసారం చేసిన భర్తకు ఫోక్స్ చట్టం కింద పదేండ్లు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుందన్నా రు. రాష్ట్ర ప్రభుత్వం బాల్యవివాహాలను అడ్డుకట్ట వేసేందుకు అనేక కార్యక్రమాలను చేపడుతుందని ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు ఎవరి దృష్టికి వచ్చిన హెల్ప్ లైన్ నెంబర్ ల ద్వారా వెంటనే సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేయాలని తెలిపారు. బాల్య వివాహం నేరం చట్టం ప్రకారం శిక్షార్హులు, బాల్య వివాహం చేసిన చేసుకున్న ప్రోత్సహించిన రెండేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా అనే నినాదాలతో తల్లిదండ్రుల్లో విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని, బాల్యవివాహాలు చట్టవిరుదమని పిలునిచ్చారు.

కేసీఆర్‌పై సీఎం వ్యాఖ్యలు సరైనవి కావు

- మాజీ సీఎం కేసీఆర్‌పై ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి వైఖరి సమంజసం కాదు
- తెలంగాణ స్టేట్ యూత్ వింగ్ అధ్యక్షులు జుబేర్ పాషా



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని తెలంగాణ స్టేట్ యూత్ వింగ్ అధ్యక్షులు జుబేర్ పాషా అన్నారు. ఆదివారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రాంత ప్రజల సంక్షేమం కోసం చావు నోట్లో తలపెట్టి ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అహింసా మార్గంలో 14 ఏళ్ల పోరాటాన్ని కొనసాగించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన చరిత్రకారుడు కేసీఆర్ అని కొనియాడారు. ఆయన పాలనలో రాష్ట్ర ప్రజలు ఎలాంటి కష్టాలు చూడలేదన్నారు. రైతుల సంక్షేమం కోసం సాగునీరు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి రైతు కన్నుల్లో కన్నీళ్లు తుడిచిన కర్షకుడు కేసీఆర్ అని అన్నారు. కాంగ్రెస్ పాలనలో తాగడానికి బిందెడు నీళ్ళ లేక, మూసీ నదిలోని మురికి నీరు తాగిన ప్రజలకు ఎవరి గొప్పతనమేందో అర్థమవుతుం దన్నారు. కెసిఆర్ చేపట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగినీరు అందించా రన్నారు. వ్యవసాయం బాగుంటే రైతు బాగుంటా డడనే ఆలోచనతో రైతులకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. కెసిఆర్ పాలన లో ఏ ఒక్క రైతన్న ఆత్మహత్య చేసుకున్నారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంత ప్రజల కోసం కార్పొరేట్ స్థాయి వైద్య సౌకర్యాలు అందించారన్నారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఆసుపత్రులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అందరికీ ఉచిత విద్య అందాలనే ఉద్దేశంతో కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తూ, గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి కేసిఆర్‌పై చేస్తున్న ఆరోపణలు మానుకోవాలన్నారు. లేకుంటే తెలంగాణ ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని జుబేర్ పాషా తెలిపారు.

జినెక్స్ సీడ్స్ వారి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన

- రిజినల్ మేనేజర్ కోటిరెడ్డి

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

నారుమడి సిద్ధం చేసుకునే ముందు మేలిమి రకాలతో నారు మడిని చేసుకున్నట్లయితే మంచి దిగుబడుతో పాటు అధిక లాభాలు అర్జించవచ్చని జినెక్స్ సీడ్ కంపెనీ రీజినల్ మేనేజర్ కోటి రెడ్డి అన్నారు. సిద్దిపేట్ మండల పరిధిలో బుస్సాపూర్ గ్రామంలో ఆదివారం జీనెక్స్ సీడ్స్ ఇండియా వారి సౌజన్యంతో చిట్టి పొట్టి సన్న రకం వరి రకానికి సంబంధించి అవగాహన కల్పించారు. చిట్టి పొట్టి సన్న రకం వరిని బుస్సాపూర్ గ్రామానికి చెందిన వల్లపు రెడ్డి సాయి రెడ్డి వ్యవసాయ భూమిలో 5 ఎకరాలలో సాగు చేయగా అధిక దిగుబడి రావడంతో జినెక్స్ సీడ్స్ సంస్థ వారి ఆధ్వర్యంలో చుట్టుపక్కల గ్రామాల రైతులతో క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. అనంతరం వల్లపు రెడ్డి సాయి రెడ్డి రైతుని జినెక్స్ సీడ్స్ సంస్థ వారు సన్మానించారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ జినెక్స్ సీడ్స్ ద్వారా చిట్టి పొట్టి సన్నరకం వరి సాగు చేయడంతో అధిక దిగుబడులు సాధించవచ్చు అన్నారు. చిట్టి పొట్టి సన్న రకం వరి రకం ఎకరానికి దాదాపు 25 నుంచి 30 క్వింటాళ్లు వస్తుందని రైతులకు రీజనల్ మేనేజర్ కోటి రెడ్డి గారు తెలిపారు. జినెక్స్ సీడ్స్‌లో వరి, మొక్కజొన్న, పత్తి, వివిధ రకాల విత్తనాలు లభిస్తాయని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట క్రాంతి ఆగ్రో కెమికల్స్ డిస్ట్రిబ్యూటర్ జగన్మోహన్ రెడ్డి ఏరియా ఆఫీసర్లు బాల్ రెడ్డి, నవీన్ వివిధ గ్రామాల రైతులు గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



జాతీయస్థాయిలో రెండు వరుస పతకాలు



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండల కేంద్రానికి చెందిన మాజీ జడ్పీటీసీ నాచగోని పద్మ వెంకట్ గౌడ్‌ల కుమారుడు నాచగోని అశ్వథామ, తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట్‌లో పదవ తరగతి చదువుతూ. జాతీయ, నేషనల్, స్థాయిలో జరిగిన రోయింగ్, క్రీడల్లో పాల్గొని వరుసగా రెండు పతకాలు సాధించాడు. అక్టోబర్ 25న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం గోరఖ్పూర్ లో నిర్వహించిన రోయింగ్. 25వ నేషనల్ సబ్ జూనియర్ ఛాంపియన్ షిప్ లో. కాస్యం పతకం, నవంబర్ 5 నుంచి కేరళ రాష్ట్రం అలిపిలో ఆల్ ఇండియా ఇంటర్ స్పోర్ట్స్ అథారిటీ ఇండియా 2024 రోయింగ్ ఛాంపియన్ షిప్‌లో రజతం పతకం సాధించాడు. రోయింగ్ క్రీడల్లో అశ్వథామ రెండు పతకాలు సాధించడం పట్ల తల్లిదండ్రులు నాచగోని పద్మ వెంకట్ గౌడ్‌లు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటింటి సర్వే సమగ్రంగా ఉండాలి



- జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

ప్రభుత్వం చేపట్టిన కులగణ సర్వే సమగ్రంగా ఉండాలని జిల్లా అదన కలెక్టర్ అబ్దుల్ అమీద్ అన్నారు. ఆదివారంజిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ హుస్నాబాద్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఆకస్మికంగా సందర్శించారు. ఎన్యుమారేటర్లు సర్వే చేస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యూమరేటర్లు ప్రజలతో ఓపికగా వ్యవహరించి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రజల నుంచి నిర్దిత సమాచారాన్ని సేకరించి జాగ్రత్తగా నమోదు చేయాలని అన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు అంత కృషి చేయాలని అన్నారు. ఎవరికైనా సర్వేపై సందేహాలు ఉంటే వాటిని కూడా నమోదు చేసుకొని తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. సూపర్వైజర్లు ప్రతిరోజూ సర్వేను పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం హుస్నాబాద్‌లోగల పీఏసీఎస్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొచ్చిన వెంటనే తేమ శాతం కొలిచి నిర్ణీత శాతం రాగానే తూకం వేసి మిల్లులకు పంపించాలని కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దారు రవీందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు కల్పించండి



నవతెలంగాణ-గజ్వేల్

ప్రభుత్వ ఆసుపత్రులను రూ.కోట్లాది వెచ్చించి నిర్మించినప్పటికీ సరైన వసతులు లేవని, అవసరమైన వసతులు, సౌకర్యాలు కల్పించాలని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి వెంకటాచారి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రూ.20 కోట్ల నిధులతో వంద పడకల ఆసుపత్రి నిర్మించగా రూ.30 కోట్లతో చిల్డ్రన్ ఆసుపత్రి నిర్మాణం చేపట్టారు. అందులో సీజన్ వ్యాధులకు, ఇతర వ్యాధులకు నయం చేసే వైద్యులు లేరని అన్నారు. అంతేకాకుండా స్కానింగ్, చర్మం, మత్తు ఇతర వాటిని బయట తీసుకోవాలని రోగులకు వైద్యులు బయటకు పంపిస్తున్నారని అన్నారు. ప్రయివేట్ ఆస్పత్రులతో ప్రభుత్వ వైద్యులు చేతివాటంతో వ్యవహారం నడుస్తుందని విమర్శించారు. పేదలకు వైద్యం అందించవలసిన ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. వెంటనే పూర్తిస్థాయి సిబ్బందిని నియమించి చిల్డ్రన్ ఆసుపత్రిలో ఆపరేషన్లు ప్రారంభించాలని కోరారు. చిల్డ్రన్ ఆసుపత్రి కేవలం ఓపికే పరిమితమైనది అన్నారు.

కారు డీకొని, వ్యక్తి మృతి



నవతెలంగాణ-బెజ్జంకి

కారు డీకొట్టడంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని గాగీల్లపూర్ గ్రామ శివారులోని రాజీవ్ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం అకేన సత్తయ్య(55) ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. తన స్వగ్రామానికి బెజ్జంకి క్రాసింగ్ నుంచి గాగీల్లపూర్ గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కారు డీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏఎస్ఐ శంకర్ రావు ఘటన స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. మృతదేహన్ని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించామని ఏఎస్ఐ తెలిపారు.

లిక్కర్ షాపుల నయా దందా..!



నవతెలంగాణ- దుబ్బాక

అక్రమ మద్యం అమ్మకాలు, బెల్ట్ షాపులను కట్టడి చేసి నియంత్రించాలని.. అలాంటి వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇదివరకే ఆదేశాలు జారీ చేసినప్పటికీ.. హయ్యర్ ఆఫీసర్లు మాత్రం అలాంటి చర్యలు తీసుకోవడం లేదు. బెల్ట్ షాపుల నయా దందా దుబ్బాక మున్సిపల్ కేంద్రంలోని పలు వార్డుల్లో, మండల పరిధిలోని పచ్చని పల్లెల్లో చిచ్చు పెడుతుండడం ఆందోళనకు గురిచేస్తోంది. ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారమే వైన్స్ షాపుల నిర్వాహకులు మద్యం అమ్మకాలు కొనసాగించాలి. అలాంటిది ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ వైన్ షాపుల నిర్వాహకులు సరికొత్త బెల్టు దందాకు తెరలేపారు. లైసెన్సుడు వైన్స్ షాపులు మద్యం విక్రయాలు జరపాల్సి ఉండగా.. సిద్దిపేట జిల్లా దుబ్బాక లో మాత్రం పెద్ద మొత్తంలో బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తున్నారు. ఈ దందా ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్విఘ్నంగా కొనసాగుతుంది. ఆ శాఖ ఆఫీసర్లు మద్యం షాపుల పై నిఘా పెట్టడం లేదు. బెల్టు షాపులను నియంత్రించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇందుకు ఆ శాఖ సిబ్బంది సహకారం మెండుగా ఉన్నట్లు తెలుస్తోంది.

సుమారు 300 వరకు బెల్ట్ షాపులు.!

దుబ్బాకలోని ఆయా వైన్స్ షాపుల నుంచి నిత్యం మున్సిపల్ పరిధిలోని పలు వార్డులు, మండల పరిధిలోని పలు గ్రామాల్లోని బెల్ట్ షాపులకు భారీ మొత్తంలో మద్యం సరఫరా అవుతుంది. మండల వ్యాప్తంగా సుమారు 300 వరకు, ఒక్క మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో సుమారుగా 30 బెల్ట్ షాపులు నడుస్తున్నట్లు ఒక అంచనా. ఈ దందా ఎంతలా ఎలా నడుస్తుందో ఊహించుకోవచ్చు. ఈ తతంగమంతా బహిరంగంగానే నడుస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

నిబంధనలు లేవు... అంతా "మామూలే "

వైన్ షాపుల నిర్వాహకులు నిబంధనలు మేరకే మద్యం విక్రయాలు జరపాలి. ఎక్సైజ్ శాఖ చట్టం ప్రకారం వ్యక్తులకు బీర్లు, మద్యం బాటిళ్లు పరిమితికి లోబడి మాత్రమే విక్రయించాలి. కానీ ఇక్కడ మాత్రం అలాంటి నిబంధనలు కనిపించవు. ఏకంగా వైన్స్ షాపుల నిర్వాహకులే బెల్టు షాప్ నిర్వాహకులకు పదుల సంఖ్యలో బీర్లు, బ్రాందీ, విస్కీ బాటిల్లను కాటన్లకు కాటన్లనే సరఫరా చేయడం గమనార్హం. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసి చూడనట్టుగా "మామూలు"గానే వదిలేస్తుండడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వైన్ షాప్‌ల రూటే సపరేటు అన్న చందంగా తయారైంది. పేరుకు మాత్రమే రిటైల్‌గా ఎంఆర్పీ కే మద్యం వికయాలు జరుగుతున్నట్లుగా కనిపిస్తోంది. కానీ అసలు కథ ఇక్కడే మొదలవుతుంది. ఇటీవల మండల కేంద్రంలోని మూడు వైన్ షాపుల నిర్వాహకులు సిండికేట్‌గా మారారు. మండలంలో ఉన్న గ్రామాలు ఒక్కో మద్యం దుఖానికి కొన్ని గ్రామాల చొప్పున లక్కీ డ్రా రూపంలో పంచుకోవడం మండల వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సిండికేట్ గా ఏర్పడ్డ వీరు తాము చెప్పినంత ఇచ్చుకోవాల్సిందేనని మున్సిపల్లోని పలు వార్డుల్లో , మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న బెల్టు షాపులపై అజమాయిషి చెలాయించడం కొసమెరుపు. ఇంత తతంగం జరుగుతున్నా.. వైన్ షాపులు, బెల్ట్ షాపులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల సంబంధిత అధికారుల చిత్తశుద్ధిపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. బెల్ట్ షాపులపై "వల్లమాలిన ప్రేమ" చూపించడంలో ప్రజలంతా ఇది షరా 'మామూల్లే "గా జరిగే తతంగమేనని గుసగుసలాడుకుంటున్నారు. ఇక నైనా సంబంధిత అధికారులు బెల్ట్ తీస్తారో లేదో వేచి చూడాల్సిందే.

- బెల్ట్ షాపుల కట్టడి, షరా "మామూల్లే"నా..?

బెల్ట్ షాపులను నిరోధించాలి

బెల్టు షాపులను విచ్చలవిడిగా నడపడం వల్ల యువత చెడు మార్గంలో వెళ్తోంది. సామాన్య, పేద మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారం పడుతుంది. మైనర్లకు సైతం మద్యం విక్రయించడం వల్ల మద్యం మత్తు బారిన పడి వారి బంగారు భవిష్యత్తు నాశనం అవుతుంది. జిల్లా ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని బెల్ట్ షాపులు నిరోధించాలని పట్టణవాసులు పలువురు మేధావులు కోరుతున్నారు.

- కే.స్వామి,కళాశాల విద్యార్థి

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పట్టణ కేంద్రంలో ఆదివారం జరిగిన పలు వివాహాలకు జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేర్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూప రాణి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, మాజీ ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు అనంతుల మల్లేశం, ముస్త్యాల నాగేశ్వరరావు, నాయకులు అంకుగారి శ్రీధర్ రెడ్డి, పచ్చిమడ్ల మానస, అరిగె కనకయ్య, తాడెం కృష్ణ మూర్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు హక్కులకు ఐక్య పోరాటాలు అవసరం



నవతెలంగాణ-గజ్వేల్

భవిష్యత్తు హక్కుల కు ఐక్య పోరాటాలు అవసరమని మాదిగ ఉద్యోగుల సమైక్య రాష్ట్ర అధ్యక్షులు మంద దేవేం ద్ర ప్రసాద్ మాదిగ అన్నా రు. ఆదివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాల ఉద్యమంలో ఎన్నో త్యాగాల ద్వార ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను సాధించుకుం దామన్నారు. మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఎన్నో సామాజిక ఉద్యమాల ఫలితాలు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు అందినట్లు చెప్పారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న నియామకాల ద్వారా వర్గీకరణ లేక పోవటంతో మాదిగ, మాదిగ ఉప కులాలు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విధించిన గడువు లోపల వర్గీకరణను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చేబర్తి యాదగిరి మాదిగ, ఉప్పరి పల్లి నాగభూషణం, దయాకర్, రవి జోగు, సల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుటుంబ సర్వేను పరిశీలించిన ఇంచార్జి ఎంపీడీవో



నవతెలంగాణ-నంగునూరు

సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వేను ఆదివారం నంగునూరు మండలం వెంకటపూర్ గ్రామంలో గ్రామ ప్రత్యేక అధికారి, మండల పరిషత్ కార్యాలయం సూపరిం టెండెంట్, నంగునూరు మండల ఇంచార్జి ఎంపీ డీవో ప్రభాకర్ రావు పరిశీలించా రు. సర్వే చేస్తున్న ఎన్యుమారేటర్లకు పలు అంశాలపై సూచనలు చేశారు. సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. ప్రజలు సర్వేను అధికారులకు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేకులపల్లి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆటపాటలతో ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని బ స్వాపూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో 2004- 2005 విద్యా సంవత్స రంలో పదోతరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆది వారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 19 సంవత్సరాల అనంతరం ఈ వేదిక ద్వారా వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులందురు ఏకమై తమ చిన్ననాటి జ్ఞాపకాలతో ఆటపాటలతో సందడి సందడిగా ఆడిపాడారు. తమ తమ మిత్రులకు ఎవరెవరు ఏఏ రంగాల్లో కొనసాగుతున్నారో తెలుపుకుంటూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఇదే పాఠశాలలో చిన్ననాడు చదువుకున్న జ్ఞాపకాలను నెమరు వేసుకొని సంతోషం వ్యక్తం చేశారు. గురువులు హాజరై నాటి విద్యార్థులను చూసి ముచ్చటిస్తూ మురిసిపోయారు. విద్యా బోధన అందించిన ఉపాధ్యాయులను ఆహ్వానించి, వారి ఆశీస్సులు తీసుకొని, సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి విద్యా సదస్సుకు రవివర్మ ఎంపిక



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని వింజపల్లి అమ్లెట్ గ్రామమైన పెరుకలగడ్డ పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు డి.రవివర్మ ఆదివారం 13వ జాతీయ స్థాయి గణిత విద్యా సదస్సుకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రవివర్మ మాట్లాడుతూ గణిత విద్యా బోధనలో ఉపాధ్యాయ సాధికారత అనే అంశంపై రాసిన పరిశోధన పత్రం జాతీయ స్థాయికి ఎంపికయ్యిందన్నారు. గణిత విద్యను ఆట పాటలతో విద్యార్థులలో ఆసక్తిని పెంపొందించడం జరగాలని, 21వ శతాబ్దం నైపుణ్యాలు శిక్షణ పొంది వాటిని తరగతి గదులలో అమలు పరచేలా చేయాలని సూచించారు. ప్రతి పాఠశాలలో గణిత కిట్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు నిత్య జీవిత అనుభవాలతో అభ్యసనం జరగాలని ఆకాంక్షించారు. ప్రాథమిక స్థాయి నుండే వేద గణితమును అలవాటు చెస్తే విద్యార్థులు గణితం పట్ల అభిరుచి, ఖచ్చితత్వం, వేగం వృద్ధి చెందుతాయన్నారు. జాతీయ స్థాయిలో గణిత సెమినార్ ఢిల్లీలో పాల్గొని పేపర్ ప్రజెంటేషన్ చేసే కార్యక్రమం జనవరి 2 నుంచి 4వ తేదీల్లో ఉందన్నారు. జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, మండల విద్యాధికారి పద్మయ్య ఉపాధ్యాయులు, గ్రామస్థులు, అభినందించారు.

రోడ్లపై ధాన్యం ఆరరబోస్తే చట్టరిత్యా కఠిన చర్యలు

- రాయపోల్ ఏఎస్ఐ కృష్ణంరాజు

నవతెలంగాణ-రాయపోల్

రోడ్లపై దాన్యం ఆరబోసి ప్రమాదాలకు కారణమైతే అలాంటి వారిపై చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకోబడతాయని రాయపోల్ ఏఎస్ఐ కృష్ణంరాజు అన్నారు. ఆదివారం అనాజీపూర్, మంతూర్ గ్రామాల్లో రోడ్లపై ధాన్యం ఆరబోసిన రైతులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసి నల్ల కవర్ కప్పడం వల్ల ధాన్యం కుప్పలు కనపడక ధాన్యం కుప్పలకు ఢీకొని ఎంతోమంది మృతి చెందిన సంఘటనలు తరచూ చూస్తున్నామని అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రోడ్లపై ఎవరూ ధాన్యం ఆరిబోయకూడదన్నారు. రోడ్లపై ధాన్యం పోయడం వల్ల వాహనదారులు, ద్విచక్ర వాహనదారులు రాత్రి సమయాలలో అది గమనించక ప్రమాదాల బారినప డుతున్నారు. వ్యవసాయ పొలాల వద్ద, ఇండ్ల వద్ద లేదా ఇత ర ప్రదేశాలలో ధాన్యం ఆరబోయడానికి ఏర్పాటు చేసు కోవాలన్నారు.నిర్లక్ష్యంగా రోడ్లపై ధాన్యం పోసి అమాయక ప్రజల ప్రాణాలు పోవడానికి కారణం కావొద్దన్నారు. ఎవరైనా ధాన్యాన్ని రోడ్లపై నిర్లక్ష్యంగా ఆరబోస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు ప్రమా దాల నివారణ గురించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.



ఉద్యోగరిత్యా సౌమ్యుడు

- కృషిపరుడు కెమ్మసారం ఎల్లయ్య

నవతెలంగాణ-సిద్దిపేట

ఉద్యోగరీత్యా సౌమ్యుడు కృషిపరుడు కెమ్మసారం ఎల్లయ్య అని సిద్దిపేట ఏకలవ్య ఎరుకల ఉద్యోగ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రిటైర్డ్ డీపీఓ కెమ్మసారం పోచయ్య అన్నారు. ఆదివారం సిద్దిపేట ఏకలవ్య ఎరుకల ఉద్యోగ సంక్షేమ సంఘం కార్యాలయ సమావేశ మందిరంలో ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన టీజీఎస్ఆర్టీసీ ఎల్లయ్య రాజమణి దంపతులను శాలువా, పూలదండలతో హైదరాబాద్ జాయింట్ కలెక్టర్ ఎస్వై గిరి, ఈఈడబ్ల్యూఎస్ ప్రధాన కార్యదర్శి దేవర కనకయ్యతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీజీఎస్ఆర్టీసీ సంస్థలో సుదీర్ఘంగా ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా క్రమశిక్షణతో ఉద్యోగ బాధ్యతను నిర్వర్తించిన వ్యక్తి కెమ్మసారం ఎల్లయ్య అని అన్నారు. తాను ఆర్టీసీలో 30 ఏండ్లు ఒకే బస్ డిపోలో పనిచేసి సంస్థకు ఆక్యుపెన్సిని పెంచి ఐదుసార్లు ఉత్తమ డ్రైవర్‌గా గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. డ్రైవర్ అంటే రోడ్డుపై క్షణం కూడా కన్నార్పకుండా 360 డిగ్రీల కోణంలో నిఘా ఉంచి ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేర్చే ఉద్యోగమని, అలాంటి ఉద్యోగంలో తాను 60 ఏండ్ల వయసులో కూడా ఎలాంటి తప్పిదాలు చేయకుండా ఉద్యోగ విరమణ చేయడం గొప్ప విశేషమని తెలిపారు. గతంలో ఎల్లయ్య చేసిన మంచి పనులను, వారి ద్వారా సహాయన్నీ పొందిన కొందరు జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీయుఎస్ ప్రధాన కార్యదర్శి కెమ్మసారం రవీందర్, విద్యుత్ శాఖ ఏఈలు కెమ్మసారం కనకయ్య, మల్లేశం, ప్రభుత్వ ఉపాధ్యాయులు దేవర మల్లయ్య, ఏకలవ్య ఎరుకల ఉద్యోగ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు కెమ్మసారం నర్సింలు, కెమ్మసారం యాదగిరి, కెమ్మసారం రవి, సిద్దిపేట ఏకలవ్య ఎరుకల సంఘం అధ్యక్షులు కెమ్మసారం రాజేష్ ఖన్నా, తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణాన్ని కాపాడుకుందాం

- రోటరీ 3150 జిల్లా గవర్నర్ శరత్ చౌదరి
- తునికి బొల్లారం కేజీబీవీ విద్యార్థులకు సానిటరీ నాప్కిన్స్ పంపిణీ

నవతెలంగాణ-ములుగు

వాతావరణంలో జరుగుతున్న మార్పులను అవగతం చేసుకుంటూనే కలుషితాన్ని నిరోధించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని రోటరీ ఇంటర్నేషనల్ 3150 జిల్లా గవర్నర్ శరత్ చౌదరి అన్నారు. ఆదివారం ములుగు మండలం తునికి బొల్లారంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు రీయుసేబుల్ సానిటరీ నాప్కిన్సును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా ప్రతి మనిషి వ్యవహరించాలని కోరారు. ఇందులో భాగంగానే ప్రతి మహిళ తిరిగి వాడుకునే సానిటరీ నాప్కిన్సును వినియోగించాలన్నారు. పర్యావరణ ప్రేమికులుగా మెలిగినప్పుడే వాతావరణం అనుకూలంగా ఉంటుందని అన్నారు. అధ్యాపకులు చెప్పిన దాన్ని మంచిగా విని ఉత్తమ పౌరులుగా ప్రతి ఒక్కరు రూపొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి వైద్యనాథ్, రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ అధ్యక్షులు నరసింహారెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి సాయిరెడ్డి, చైర్మెన్లు చంటి, కర్నాకర్ రెడ్డి, జగదీశ్వర్, బాబు గౌడ్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ-రాయపోల్

సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి కుటుంబంలోని పూర్తి వివరాలను సేకరించాలని రాయపోల్ మండల ప్రత్యేక అధికారి బాబు నాయక్, ఎంపీడీవో బాలయ్య, ఏపీఎం కిషన్ అన్నారు. ఆదివారం రాయపోల్, కొత్తపల్లి, రాంసాగర్, అంకిరెడ్డి పల్లి గ్రామాల్లో సర్వేను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర కుటుంబ సర్వేను ఎన్యుమారేటర్లు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఎన్యుమారేటర్లకు కేటాయించిన బ్లాకులలోని పూర్తి వివరాలను సేకరించాలని ప్రజలకు వారు సేకరించి ప్రశ్నలకు సంబంధించిన పూర్తి అంశాల వివరాలను తెలియజేస్తూ 75 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను సేకరించాలన్నారు. ప్రజలు కూడా కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, ధరణి పట్టాదారు పాస్ పుస్తకం, రేషన్ కార్డు, మొబైల్ నెంబర్ వంటి వివరాలను సిద్ధంగా ఉంచుకుని సర్వే కోసం ఇంటికి వచ్చిన ఎన్యుమారేటర్‌కు, అధికారులకు సహకరించి సర్వేలో పూర్తి వివరాలు నమోదు చేసుకుని సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రాము, సీసీ రాజేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మెన్ శ్రీనివాస్ గుప్త, ఎన్యుమారెటర్లు తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సహకరించాలి

నవతెలంగాణ-కోహెడ

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. ఆదివారం మండలంలోని బస్వాపూర్ గ్రామంలో సమగ్ర సర్వే తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే కుటుంబ వివరాలను ఎన్యూమరేటర్‌లు అడిగి తెలుసుకుంటారన్నారు. అధికారులకు సహకరించి వివరాలను అందించాలని కోరారు. అనంతరం గ్రామంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటను దళారులకు అప్పగించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనె విక్రయించి మద్దతు ధరను పొందాలని సూచించారు. ఆయన వెంట తహాసీల్దార్ సురేఖ, ఆర్ఐ, రైతులు, తదితరులు ఉన్నారు.



మాల మహానాడు గ్రామ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-నంగునూరు

మండల పరిధిలోని రాజగోపాల్ పేట గ్రామంలో ఆదివారం మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అల్లిబిల్లి నర్సింగారావు ఆధ్వర్యంలో నూతన గ్రామ కమిటీ ఎన్నుకున్నారు. మాలమహానాడు రాజగోపాల్ పేట గ్రామ అధ్యక్షులుగా సయ్యాది రమేష్, ఉపాధ్యక్షులుగా నీల రమేష్, ప్రధాన కార్యదర్శిగా కాటం విద్యాసాగర్, ప్రచార కార్యదర్శిగా కంటె సాగర్, కార్యదర్శిగా తలారి రమేష్, గౌరవ సలహాదారులుగా కాటం కనకయ్య, కాటం శివ, నీల నాగయ్య, జాజల కనకయ్య, కాటం రాములు, ముక్క అనిల్, కాటం శ్రీనివాస్, మాలమంగళి బద్రయ్య, కోడూరి మహేష్‌లు, సభ్యులుగా సుద్దాల శ్రీధర్, కాటమ్ శ్రీధర్, సుద్దాల ప్రదీప్, మాలమంగళి మల్లేశం, నీల ప్రవీణ్, కాటం వంశీ, కోడూరి బాబు ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి అల్లిబిల్లి నర్సింహారావు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల విడదీసి వారి మధ్య చిచ్చులు పెట్టి రాజకీయక లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ ఇకనైనా ఆపకపోతే దేశ వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని, ఈ నెల 24వ తేదీన హైదరాబాద్ జరిగే మాలమహానాడు అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

